ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 17 మే 2025





వంగతోటలో కాయలు వదిలేసిన దృశ్యం

రైతు బతికేదెట్లా ?

● వందల కోట్ల ఆదాయం కోల్పోయిన వైనం



కాయలున్న దోసతోటలో మేస్తున్న గొర్రెలు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట జిల్లాలో వరి, వేరుశనగ పంటలే సాంప్రదాయంగా పండించే వాళ్లు. ఈ పంటలు ఏమాత్రం లాభసాటిగా లేకపోవడంతో.. ప్రత్యామ్నాయంగా దోస, కర్బూజతో పాటు టమోటా, వంకాయ, బెండ, చిక్కుడు వంటి కూరగాయల సాగు వైపు దృష్టి సారించారు. ఇందులో ప్రధానంగా చెప్పుకోవాల్సిన పంట టమోటానే. జిల్లాలో దాదాపు సగానికి పైగా మండలాల్లో టమోటా సాగు చేస్తున్నారు. కర్బూజ, దోస వంటి వాణిజ్య పంటలనూ సాగు చేస్తున్నారు. ఇటువంటి రైతులను నష్టాలు వెంటాడుతున్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావడం లేదు. జిల్లాలో టమోటా రైతులు సుమారు రూ.300 కోట్లు పెట్టుబడి నష్టపోగా.. దోస, కర్బూజ రైతులు రూ.37 కోట్లు పెట్టుబడులు కోల్పోయారు. ఇదే కోవలోనే కూరగాయల రైతులు సైతం నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఇలా అయితే రైతు బతికేదెట్లా అని పలువురు వాపోతున్నారు.

రూ.300 కోట్ల టమోటా పెట్టుబడులు నష్టం

ప్రస్తుతం జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో టమోటాను సాగు చేశారు. ఎక్కువగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో సాగు చేశారు. పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో కొన్ని మండలాల్లో అధికంగానే సాగు చేశారు. రైతులు చెబుతున్న ప్రకారం.. తీగ టమోటా సాగు చేయడానికి ఎకరాకు రూ.3లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇప్పుడు పంట దిగుబడి కూడా బాగా ఉంది. అయితే ఆ మేరకు ధరలు లేవు. మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.2 నుంచి రూ.4 వరకు పలుకుతోంది. 30 కిలోల కిరీటి రూ.60 నుంచి 120 లోపు ధర పలుకుతోంది. దీంతో కనీసం పెట్టుబడులు చేతికి రాక.. రైతులు తోటలోనే.. కాయలు వదిలేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం.. జిల్లాలో 4 వేల హెక్టార్లలో టమోటా సాగు చేశారు. ఈ లెక్కన జిల్లాలో టమోటా సాగు చేయడానికి దాదాపు రూ.300 కోట్లు ఖర్చు చేశారు. ఇదే పరిస్థితి దోస రైతులను ఇబ్బంది పెడుతోంది. జిల్లాలో సుమారు 2500 ఎకరాల్లో దోస, కర్బూజ పంటలు సాగు చేశారు. ఇందుకు ఎకరాకు రూ.1.5 లక్షల చొప్పున ఖర్చు అవుతోంది. ఈ లెక్కన వీటి సాగు కోసం రూ.37.5 కోట్లు ఖర్చు చేశారు. ధరలు లేక.. తోటలను గొర్రెలకు మేతకు వదిలేశారు. వంకాయ రైతు కూడా నట్టేట మునిగిపోయాడు. చెన్నై మార్కెట్‌లో 70 కిలోల వంకాయ మూట.. కేవలం రూ.500 మాత్రమే ధర పలుకుతోంది. దీంతో పెట్టుబడులు కూడా రాక.. తోటలోనే.. కాయలు వదిలేస్తున్నారు.



ధరలు లేక.. పొలాల గట్ల మీద పారవేసిన టమోటా

- ● రైతు నెత్తిన నష్టాల మూట
- ● రూ.300 కోట్లకు పైగా టమోటా పెట్టుబడి నష్టం
- ● రూ.37 కోట్లు దోస, కర్బూజ నష్టం

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



ధరలు నిలకడగా లేకపోవడంతో.. దిగుబడి బాగానే ఉన్నా.. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమోటా నిల్వ చేసుకునేందుకు.. జిల్లాలో విరివిగా కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని.. గిట్టుబాటు ధరలు కల్పించాలి.

- వై.బాలక్రిష్ణారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకుడు

దురదృష్టవంతుడు భిక్షమెత్తుకోవడానికెళితే... రాళ్ల వాన కురిసింది.. అని రాయలసీమ ప్రజల నోళ్లలో తరుచూ వినపడే సామెత. ప్రస్తుతం జిల్లాలో రైతులకు ఇది అచ్చుగుద్దినట్లు సరిపోతుందనడంలో సందేహం లేదు. ఇప్పటికే సాగునీటి వనరులు ఏమాత్రం లేక.. కేవలం వర్షాధారంగానే పంటలు సాగు చేస్తూ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే రైతులను దురదృష్టం వెంటాడుతోంది. ఏ పంట సాగు చేసినా గిట్టుబాటు ధరలు లేక రైతు నెత్తిన నష్టాల మూట పెడుతోంది. ఆదాయం సంగతి దేవుడెరుగు.. కనీసం పెట్టిన పెట్టుబడులు చేతికి అందడం లేదని లబోదిబోమంటున్నారు. జిల్లాలో టమోటా, దోస, కర్బూజ, కూరగాయల రైతులు వందల కోట్ల ఆదాయం కోల్పోయారు.

దోస కొంప ముంచేసింది



గతంలో ఎప్పుడూ టమోటా సాగు చేసేవాళ్లం. అయితే టమోటా సాగుకు కూలీలతో పెద్ద సమస్య. అదే దోస అయితే.. ఒకసారి కలుపు తీత.. మరోమారు సుడులు తప్పించేందుకు మాత్రమే కూలీలతో పని. రూ.మూడు లక్షలు ఖర్చు చేసి.. రెండు ఎకరాల్లో దోస సాగు చేశాను. ఎన్ని ప్రతి కూల పరిస్థితులు వచ్చినా.. చెప్పుకోదగ్గ స్థాయిలోనే దిగుబడి వచ్చింది. అయితే కాయలు కొనేందుకు వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. కాయలు తోటల్లోనే మాగిపోయాయి. దీంతో విధి లేక తోటలో కాయలతో సహా... గొర్రెల మేతకు వదిలేశాము. నాలుగు నెలల క్రితం దోస కిలో రూ.30 నుంచి 40 వరకు ఉండేది. ఇప్పుడు రూ.3 నుంచి 5 మాత్రమే ఉంది.

- నరసింహులు, చిన్నమండెం

70 కిలోల మూట.. రూ.500 మాత్రమే



మూడు ఎకరాల్లో వంకాయ పంటను సాగు చేశా. ఎకరాకు లక్ష చొప్పున మూడు లక్షలు ఖర్చు చేశా. సాగు చేసిన పంట ప్రస్తుతం దిగుబడి వస్తోంది. పది రోజుల క్రితం కాయలు కోసి తమిళనాడు రాష్ట్రం చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్లా. 70కిలోల మూట కేవలం రూ.500 మాత్రమే ధర పలికింది. ఇక్కడి నుంచి చెన్నై మార్కెట్‌కు తరలించడానికి మూటకు రూ.250 వరకు ఖర్చు వచ్చింది. కూలీల కోత, మినీలారీ లోడింగ్ చేసేందుకు.. మూటకు రూ.150 వరకు ఖర్చు వచ్చింది. దీంతో ఖర్చులు పోనూ.. కేవలం వంద మాత్రమే మిగిలింది. కాయలు కోయకుండా తోటలోనే వదిలేశా..

- సుబ్బిరెడ్డి, ములకలచెరువు

రూ.3 లక్షలు ఖర్చు చేస్తే.. రూ.లక్ష వచ్చింది



జనవరిలో రెండు ఎకరాల్లో టమోటా సాగుకు మూడు లక్షలకు పైగా ఖర్చు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. అయితే ధరలు లేవు. అయినా తోటలోనే కాయలను వదల్లేక.. కోయించి కోలార్ మార్కెట్‌కు తరలించా.. మూడు లక్షల పైబడి పెట్టుబడికి.. రూ.లక్ష మాత్రమే చేతికి వచ్చింది.. ఈ పంటలో సుమారు రూ.2లక్షలు నష్టపోయా. ఈ సీజన్‌లో అయినా ధరలు ఉంటాయనే ఆశతో.. మార్చిలో ఎకరాలో సాగు చేశాను. ప్రస్తుతం దిగుబడి వస్తోంది. మార్కెట్‌లో కిలో టమోటా ధర రూ.2 నుంచి రూ.4 వరకు పలుకుతోంది. ఈ ధరలు ఇలాగే ఉంటే.. పెట్టుబడి కూడా రాదు.

- రెడ్డిశేఖర్, శీలంవారిపల్లె, గుర్రంకొండ

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పటిష్టంగా నిర్వహించాలి

- ● జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు రాకూడదు
- ● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మే నెల థీమ్ ఉష్ణాన్ని నివారించే విధంగా 17న శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించాల్సిన కార్యక్రమాల నిర్వహణ, తాగునీరు, ఉపాధి హామీ, పల్లెపండుగ పనుల ప్రగతిపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

చెత్త రహితంగా రూపొందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ, మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రముఖ కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఇతరత్రా అవసరమైన చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పరిశీలించి ప్రజలకు నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. నీరు ప్రతి ప్రాణికి అవసరమని, అందువల్ల శనివారం పశుపక్షాదులకు కూడా చిన్న చిన్న పాత్రలు, మూకుళ్లలో నీరు ఏర్పాటు చేయాలని, పెద్ద పశువులకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎక్కడైనా బోర్లు, మోటార్లు పనిచేయకుంటే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా జిల్లాలో పదివేల ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టాల్సి ఉందని, ఈ మాసం చివరి నాటికి 3 వేల ఎకరాల్లో గడ్డి పెంపకానికి భూములు గుర్తించి ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్థులపై నిఘా ఉంచండి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

చిన్నమండెం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళలో గస్తీ విధులు పటిష్టం చేయడంతో పాటు పాత నేరస్థులపై నిఘా ఉంచాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రిసెప్షన్ కేంద్రంలో రికార్డుల నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారానికి తదితర అంశాలను పరిశీలించి మహిళల సమస్యలకు ప్రాధాన్యత ఇస్తూ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసుల సీడీ ఫైళ్లను పరిశీంచి వాటి దర్యాప్తు పురోగతిపై ఆరాతీశారు. రౌడీ షీటర్లు, చెడు నడవడిక కలిగిన వ్యక్తులపై, పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించి గ్రామస్థులతో మమేకమై ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిరోధించేందుకు గ్రామ సందర్శన, దత్తత కానిస్టేబుల్, మహిళా పోలీసుల సమన్వయంతో కట్టడి చేయాలన్నారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ ఎస్పీ వెంట ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

హంద్రీ-నీవా జలాలతో...
రాయలసీమను సస్యశ్యామలం చేస్తాం

- ● మంత్రి నిమ్మల రామానాయుడు
- ● రూ.3840 కోట్లు నిధులు కేటాయింపు
- ● వైసీపీ పాలనలో జరిగిన పనులు శూన్యం
- ● పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

కురబలకోట, మే 16 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలతో పంట పొలాలకు సాగు, ప్రజలకు తాగునీటిని అందించి రాయలసీమను సస్యశ్యామలంగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దొమ్మన్నబావి సమీపంలో హంద్రీ-నీవా కాలువను పరిశీలించి కాంక్రీట్ పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడులు రాయలసీమకు తాగు, సాగు నీరు అందివ్వడంలో ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. హంద్రీ-నీవా, గాలేరు-నగరి, తెలుగుగంగకు ప్రాధాన్యమైన ప్రాజెక్టులు దివంగత మాజీ సీఎం ఎన్‌టీఆర్, సీఎం చంద్రబాబునాయుడుల సారధ్యంలోనే ప్రాజెక్టులకు రూపకల్పన చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో తాగు, సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం జగన్ 2020 నాటికి పూర్తి చేస్తామని ప్రగల్భాలు పలికారని, ఐదేళ్లలో హంద్రీ-నీవాకు సంబంధించి తట్ట మట్టి పని, రవ్వంత సిమెంట్ పని చేయలేదని రైతులే చెబుతున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా నాడు సీఎం చంద్రబాబు 3850 క్యూసెక్కుల నీటిని హంద్రీ-నీవాకు తరలించడానికి అనుగుణంగా రావడానికి మోటార్లను బిగిస్తే జగన్ అధికారంలోకి రాగానే వాటిని నిర్వీర్యం చేసి కేవలం 2 వేల క్యూసెక్కుల నీటిని తీసుకునే



కాంక్రీట్ పనుల ప్రారంభానికి పూజలు చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

చర్యలు చేపట్టి రైతులను అన్ని విధాలా దగా చేశారన్నారు. రాయలసీమ బిడ్డ అని చెప్పుకుంటూ ఏ ముఖ్యమంత్రి చేయనటువంటి అన్యాయం చేశారని విమర్శించారు. హంద్రీ-నీవాకు రూ.3840 కోట్ల నిధులను కేటాయించడంతో పాటుగా ఏజెన్సీ ద్వారా పనులను పరుగెత్తించి పనులు చేస్తున్నామన్నారు. వచ్చే నెల ఆఖరిలోగా పనులను పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

ఈ సందర్భంగా హంద్రీ-నీవా అధికారులతో సమావేశం నిర్వహించి పనులకు సంబంధించి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాగా పనుల నాణ్యతలో రాజీ పడకుండా పని చేయాలన్నారు. పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని, పనులకు సంబంధించి అధికారులు ప్రతి 5 కి.మీ.కు ఒక ఏఈ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ప్రతి వారం దీనిపై రివ్యూలు ఉంటాయని, వారంలో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని లేకపోతే తప్పనిసరిగా సచివాలయానికి రావాల్సి ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని పిచ్చలవాండ్లపల్లె సమీపంలో నిర్మిస్తున్న రిజర్వాయర్‌కు, భూములు కోల్పోయిన రైతులకు భూ పరిహారం, పునరావాసం కల్పించాలని మంత్రికి భూ బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, తంబల్‌పల్లె కోఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, హెచ్‌ఎన్‌ఎస్ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, సీఈ వరప్రసాద్, ఎస్ఈ విఠల్‌ప్రసాద్, ఈఈలు రాజగోపాల్, నీలకంఠరెడ్డి, డీఈ వెంకటప్రతాప్, ఎంపీడీవో గంగయ్య, తహసీల్దార్ తపస్విని, టీడీపీ మండల అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ నాయకులు రాఘవరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుక్క కడుపులో ఏనుగు పిల్ల?!

● చూసేందుకు ఎగబడిన జనం

6

భక్తుల కొంగు బంగారం గర్నిమిట్ట యల్లమ్మ



● నేటి నుంచి అమ్మవారి జాతర

6

పెళ్లింటికి చల్లని కబురు

- ● చోరీ అయిన బంగారు రికవరీ
- ● సమాచారం అందించిన పోలీసులు

అనంతపురం క్రైం/రాయదుర్గం, మే 16(ఆంధ్రజ్యోతి): కుటుంబం కోసం అతను కువైట్ 20 ఏళ్లకు పైగా గడిపాడు. కొవిడ్ సమయంలో భార్య, కొడుకు మృతి చెందారు. దీంతో అతను స్వదేశానికి తిరిగొచ్చాడు. తనకంటూ మిగిలిన ఒక్కగానొక్క కూతురు ఇంకో నెలలో పెళ్లి జరగాల్సి ఉండగా.. ఇంట్లో దొంగపడి బంగారాన్ని దోచుకుపోయాడు. దీంతో ఆ తండ్రి హతాశుడయ్యాడు. ఇంతలో పోలీసులు అతడికి చల్లటి కబురు అందించారు. 'ఒక దొంగను పట్టు కున్నాం. రికవరీ చేసిన బంగారంలో మీరు పోగొట్టు కున్నదీ ఉంది.' అన్నారు. అంతే.. ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. వివరాలిలా..

రాయచోటికి చెందిన విజయ్‌భాస్కర్, క్రిష్ణవేణి దంపతులకు సాయి ప్రతాప్‌నాయుడు, ప్రీతి సంతానం. 20 ఏళ్ల క్రితం విజయ్ భాస్కర్ కువైట్‌కు వెళ్లారు. కొవిడ్ సమయంలో 2021లో భార్య క్రిష్ణవేణి, కుమారుడు ప్రతాప్ మృతి చెందారు. దీంతో విజయ్‌భాస్కర్ రాయచోటికి తిరిగి వచ్చారు. కూతురుకు పెళ్లి కుదరడంతో బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలను రెండు నెలల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. మరో నెల రోజుల్లో పెళ్లి. ఈ క్రమంలో గత నెల 30న తండ్రికి కంటి వైద్యం చేయించేందుకు కూతురు వైద్యుడి వద్దకు వెళ్లింది. వారు తిరిగి వచ్చేలోగా ఇంట్లో చోరీ జరిగింది. మొత్తం 31 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకుపోయారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ క్రమంలో అనంతపురం జిల్లా కణేకల్లు పోలీసులు పీట్ల గంగాధర్ అలియాస్ సాంబ అనే అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేశారు. అతన్నుంచి 45.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో విజయ్ భాస్కర్ ఇంట్లో చోరీ చేసిన 31 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. ఈ విషయాన్ని పోలీసులు బాధిత కుటుంబానికి తెలియజేశారు. ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయింది.

కాగా.. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన పీట్ల గంగాధర్, క్రికెట్ బెట్టింగ్, జూదానికి బానిసయ్యాడు. జల్సాలకు అలవాటుపడ్డాడు. డబ్బులకోసం చోరీలు చేసేవాడు. రాయదుర్గం, రాప్తాడు, గోరంట్ల, గాండ్ల పెంట, బ్రహ్మసముద్రం, అనంతపురం, ఉరవకొండ, విడపనకల్లు, డోన్, పులివెందుల, రాయచోటి, తెలంగాణ లోని వికారాబాద్, కొత్తకోట, ఆమనగల్లు, షాద్‌నగర్, కర్ణాటకలోని జగలూరు, బళ్లారి ప్రాంతాల్లో ఇతడిపై చోరీ కేసులు ఉన్నాయి. మొత్తం 40 కేసుల్లో నిందితుడు.



స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి వస్తువులు



నిందితునితో పోలీసులు

కుక్క కడుపులో ఏనుగు పిల్ల?!

● చూసేందుకు ఎగబడిన జనం



బూచిపల్లెలో ఏనుగు ఆకారంలో పుట్టి మృతిచెందిన కుక్కపిల్ల

పెద్దతిప్పసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏనుగు ఆకారంలో కుక్క పిల్ల జన్మించడంతో దానిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలోని బూచిపల్లెలో చోటుచేసుకుంది. సదరు గ్రామానికి చెందిన నరసింహులు పెంచుకుంటున్న ఓ కుక్క గురువారం మూడు కుక్క పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఓ పిల్ల ఏనుగు ఆకారంలో ఉండడం ఆసక్తి రేపింది. ఈ విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో చూసేందుకు జనం ఎగబడ్డారు. అయితే ఆ పిల్ల పుట్టిన కొద్దిసేపటికే మృతి చెందడంతో అంత్యక్రియలు చేశారు.

ఆలస్యంగా నరసాపూర్ - కదిరి ఎక్స్‌ప్రెస్

● నాలుగు గంటలకు పైగా ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. నాలుగు గంటలకుపైగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక కారణాలతో ఈ రైలు చీరాలలో రెండు గంటలకుపైగా నిలిచిపోయింది. దీంతో ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 11.17 గంటలకు వచ్చింది. తిరుపతికి తెల్లవారుజామున 4.15కు రావాల్సి ఉండగా ఉదయం 8.17 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 5.39కి రావాల్సి ఉండగా 9.52కు, కలికిరికి తెల్లవారుజామున 5.54కు రావాల్సి ఉండగా ఉదయం 10.10కి, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 10.39 గంటలకు వచ్చింది. కదిరికి ఉదయం 7.39 గంటలకు వెళ్లాల్సిన రైలు ఉదయం 11.49 గంటలకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు స్టేషన్లలో గంటల తరబడి వేచి చూశారు. రైలులో ప్రయాణిస్తున్న వారు గమ్యస్థానాలకు చేరేలోగా చుక్కలు కన్పించాయి. ప్రతి రోజు ఈ రైలు నరసాపూర్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుండగా ధర్మవరంలో ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కొన్ని రోజులుగా కదిరి వరకే నడుస్తోంది.

భక్తుల కొంగు బంగారం

గర్నిమిట్ట యల్లమ్మ

● నేటి నుంచి అమ్మవారి జాతర

● చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

పీలేరు, మే 16(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా విరాజిల్లుతోంది. కేవీపల్లె, గర్నిమిట్ట గ్రామాలకు గ్రామ దేవత అయిన యల్లమ్మ సంతాన ప్రదాయినిగా, విద్య, ఉద్యోగ, ఉపాధి మార్గాలను అనుగ్రహించే దేవతగా ఈ ప్రాంత ప్రజల నమ్మిక. కేవలం కేవీపల్లె మండలమే కాకుండా పొరుగున ఉన్న పీలేరు, సుండుపల్లె, సంబేపల్లె, కలకడ, కలికిరి, రొంపిచెర్లతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా అమ్మవారికి భక్తులు ఉండడం విశేషం. పీలేరు పరిసర ప్రాంతాల్లో అమ్మవారికి చాందినీ బండ్ల ద్వారా మొక్కులు తీర్చుకునే ఆచారం యల్లమ్మ జాతర ద్వారానే ప్రారంభం కావడం మరో విశేషం. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి అనంతరం వచ్చే ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి జాతర జరుగుతోంది. జాతరను ఘనంగా నిర్వహించేందుకు అటు భక్తులు, ఇటు ఆలయ నిర్వాహక కమిటీ పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.





ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు, 300 ఏళ్లుగా పూజలందుకుంటున్న అమ్మవారి రాయి

ఆలయ చరిత్ర

గర్నిమిట్ట యల్లమ్మ ఆలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వారి కథనం మేరకు సుమారు 300 ఏళ్ల క్రితం గర్నిమిట్ట కస్పాలో ఓ యాదవ కుటుంబం ఉండేది. వీరి పశువుల పాకలో ఆ ఇంటి యజమాని నిత్యం తన పశువులకు గ్రాసం వేసి మేపుకునేవాడు. ఆ క్రమంలో ఒకరోజు ఆయన పశుగ్రాసం గాటిలో ఓ నల్లటి రాయి కనిపించింది. ఏదో రాయి అనుకుని ఆయన దానిని తీసి పక్కన పడేశాడు. మరుసటి రోజు కూడా అదే రాయి అదే గాటిలో కనిపించడంతో మరలా పక్కన పడేశాడు. వారం రోజులు ఇదే తంతు కొనసాగడంతో ఆయన చిరాకు పడి ఆ రాయిని కోపంతో గోడ కేసి విసిరి కొట్టగా ఆ రాయి నుంచి రక్తం రావడంతో దానిని మాయగా భావించాడు. అదే రోజు రాత్రి ఆయనకు కలలో ఓ దేవత వచ్చి తాను రోజూ కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని, తనను గ్రామదేవతగా కొలిస్తే గ్రామాన్ని చల్లగా కాపాడుతానని చెప్పింది. దీంతో ఆయన ప్రస్తుతం ఆలయం ఉన్న చోట ఆ రాయిని ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామస్తులు అమ్మవారిని కొలుస్తూ ప్రతి ఏటా జాతర నిర్వహిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ యాదవ కుటుంబానికి చెందిన వారే పూజారులుగా కొనసాగుతున్నారు.



గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం

చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

చెట్టు కింద చిన్న రాయిగా ప్రారంభమైన యల్లమ్మ వైభవం కాలక్రమంలో ఆలయంగా రూపాంతరం చెందింది. సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అంశాల్లో నమ్మిన వారికి నమ్మినట్లు అనుగ్రహించడంతో గర్నిమిట్ట, కేవీపల్లెతో పాటు కేవీపల్లె మండల వ్యాప్తంగా అమ్మవారిపై ప్రజలకు భక్తివిశ్వాసాలు పెరిగాయి. అమ్మవారికి మొక్కుకున్న వారు తమ కోరికలు తీరిన అనంతరం కృతజ్ఞతగా జాతర సందర్భంగా చాందినీ బండ్లు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాల్లో చాందినీ బండ్ల వైభవం గర్నిమిట్ట జాతరతోనే మొదలైందని చెప్పవచ్చు. ఒకప్పుడు వందకు పైగా ఇక్కడ చాందినీ బండ్లు వచ్చేవి. ఇటీవల చాందినీ బండ్ల సంఖ్య తగ్గినప్పటికీ గత ఏడాది కూడా దాదాపు 50 బండ్లు వచ్చాయి. ఈ ఏడాది వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు తెలిపారు. కేవీపల్లె మండల వాసులే కాకుండా వ్యాపారం కోసం ఈ ప్రాంతానికి వచ్చిపోయే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారులు కూడా అమ్మవారి భక్తులుగా మారారని, జాతర కోసం వారందరూ తరలి వస్తారని గర్నిమిట్ట వాసులు తెలిపారు.

నేటి నుంచి జాతర

యల్లమ్మ అమ్మవారి జాతర శనివారం నుంచి సోమవారం దాకా మూడు రోజులపాటు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు సురేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జాగారం, ఆదివారం బోనాల సమర్పణ, రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు, సోమవారం మొక్కుబడుల చెల్లింపులు ఉంటాయని ఆయన వివరించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రికార్డు డ్యాన్సులు, మోతాదుకు మించి డీజేలు ఉండకూడదని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

ఆలయాల అభివృద్ధే లక్ష్యం

● దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

నిమ్మనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి దేవదాయ శాఖ ముఖ్య ఉద్దేశమని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. మండలంలో ఆ శాఖ ఆధ్వర్యంలో పునర్నిస్తున్న ఆలయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవళం గ్రామంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.17 కోట్లు కేటాయించగా, మొదటి విడతలో కోటి రూపాయల విలువపైన పనులు పూర్తయ్యాయన్నారు. రెండత విడత నిధులు త్వరలోనే మంజూరవుతాయన్నారు. బొంతవారిపల్లి వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు కాగా వాటి పనులు కూడా దాదాపు పూర్తయ్యాయన్నారు. అనంతరం రాచవేటివారిపల్లిలోని మృత్యుంజయ శివాలయంలో ధూపదీప కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మదనపల్లెఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ, పుంగనూరు బైపాస్ రోడ్డు, బై జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఇందులో భాగంగా మానపల్లెలో వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన మైనర్ల తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి పోలీసు స్టేసన్ పరిధిలో సుమారు 200 మంది వాహనచోదకులపై కేసులు నమోదు చేశామన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయారాదని సూచించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

వ్యాసరచనతో పిల్లల్లో సృజనాత్మకత : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన వల్ల పిల్లల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంపొందుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను, మెమెంటోలను, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి నెల మూడవ శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం థీమ్ బీట్ ద హీట్ అనే అంశంపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలను ఈ నెల 15న నిర్వహించామని, మొత్తం 24 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన నికిత రెడ్డి, చిత్రలేఖనంలో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన భవ్య అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

విద్యుత్ స్తంభాలు అమర్చితేనే నిధులు

● వైఎస్ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కడప జేసీ అదితిసింగ్

రాయచోటి టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో ఉన్న ఎంఐజీ లే అవుట్‌లో విద్యుత్ స్తంభాలను ఎలాపడితే అలా కాకుండా సక్రమంగా అమర్చితేనే నిధులు మంజూరు చేస్తామని వైఎస్సార్ కడప జిల్లా జేసీ, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ వీసీ అదితిసింగ్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఎంఐజీ లేఅవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 298 ఇంటి స్థలాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ఆరా తీసి లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. అలాగే ఎంఐజీ లేఅవుట్ డ్రైనేజ్ సిస్టం సరిగ్గా లేదని, విద్యుత్ స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేయాల్సి ఉందని సంబంధిత అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. అలాగే రెండో విడత ఎంఐజీ లేఅవుట్‌కు సంబంధించిన నివేదికలను వీలైనంత త్వరగా పంపించాలని రాయచోటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

భరతమాత కోసం దేశపౌరులందరూ సిద్ధం

● తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



తిరంగా ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

మదనపల్లెటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): భారతదేశం కోసం త్యాగాలు చేయడానికి దేశపౌరులందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్దఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, జనసేన నాయకురాలు దారం అనిత పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనికుల పోరాటపటిమతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదనపల్లెకు గొప్ప పేరుందన్నారు. అలాంటి మదనపల్లెలో తిరంగా ర్యాలీ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ మాట్లాడుతూ పౌరులందరు సురక్షితంగా ఉండాలని సరిహద్దుల్లో సైనికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. పీఎం నరేంద్రమోదీ, సైనికులకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ ప్రభుత్వాస్పత్రి, బీసెంట్ సర్కిల్, బెంగళూరు బస్టాండు మీదుగా చిత్తూరు బస్టాండు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, యల్లంపల్లె ప్రశాంత్, భగవాన్, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మార్పురి శశిధర్‌నాయుడు, ఆర్‌కే రామకృష్ణాచారి, ఎస్‌ఏ మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, కలకడ వేణు, చిన్ని, బీజేపీ, జనసేన నాయకులు, పెద్దసంఖ్యలో మహిళలు త్రివర్ణ పతాకాలు చేతపట్టి పాల్గొన్నారు.

పక్కా గృహాలు పూర్తి చేయండి : పీడీ

సిద్దవటం, మే 16 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్‌లో పక్కా గృహాల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కేఆర్ నగర్‌లో 2019-20లో మంజూరైన గృహాలు త్వరగా నిర్మించడానికి కాంట్రిబ్యూషన్ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ఒక్కొరికి రూ.50 వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తామని, నిర్మాణ పనులు జూన్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు. ఆయా జిల్లాల్లో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచూ సూచనలు, హెచ్చరికలు చేసినా వారిలో మార్పు రాలేదని, అందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

రైతే దేశానికి వెన్నెముక

● కిసాన్‌మేళాలో ఎమ్మెల్యే, విప్ శ్రీధర్

రైల్వేకోడూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణలో కిసాన్‌మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతో లాభాలను రైతులు పొందాలని, ఉద్యాన హబ్‌గా రైల్వేకోడూరును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువుగా ఉన్నదని బ్రిటీష్ కాలంలోనే గుర్తించి 1935లోనే ఉద్యాన పరిశోధనా స్థానం ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల సేవలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉన్నారని తెలిపారు. అలాగే ఇక్కడ జ్యూస్‌పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు మంచి నాణ్యమైన పండ్ల తోటలను సాగు చేసి లాభాలు పొందాలన్నారు. ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు పండ్లతోటల సాగులో కాకుండా కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారని తెలిపారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులు అందిచేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయల ఉత్పత్తులు నాణ్యత ప్రమాణాలు బాగుంతటే ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తద్వారా రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే విలువ ఆధారిత ఉత్పత్తుల పై రైతులు దృష్టి సారించాలన్నారు. రాయలసీమ జోన్ ఏడీఆర్ డాక్టర్ మధుమతి మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగులో ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ కేఎం యువరాజ్ మాట్లాడుతూ 1935లో ఏర్పాటైన ఉద్యాన పరిశోధన స్థానం 90 ఏళ్లు రైతుల కోసం విశిష్టమైన సేవలు అందిస్తుందన్నారు. నిమ్మ, బొప్పాయి, మామిడి తదితర వాటి పై పరిశోధనల్లో పురోగతి సాధించినట్లు తెలిపారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. అనంతరాజుపేట అసోసియేట్ డీన్ వీటీ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పరిశోధనను చేస్తున్నామని గుర్తు చేశారు. పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఆర్.నాగరాజు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటల సాగును రైతులు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ కే.కవిత మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుతో పాటు చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పుదినుసులు పంటలను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌నాయక్, డాక్టర్ యోహన్, డాక్టర్ వై.పుష్పావతి, డాక్టర్ జీ.రాజేశ్వరి, డాక్టర్ రూత్‌బెనర్జీ, డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ రామయ్య, డాక్టర్ గిరిధర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కె.లలిత, డాక్టర్ ముకుందలక్ష్మీ, డాక్టర్ వై.శిరీషా, డాక్టర్ వై.దీప్తికిరణ్, ఆదర్శ రైతులు బుర్రు సుబ్రహ్మణ్యం, వెంకట్రామరాజు, ఉంగరాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఉత్పత్తుల ప్రదర్శన

కిసాన్‌మేళా సందర్భంగా కూరగాయలు, పండ్లు, మొక్కలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పుదినుసులు, జీవన ఎరువుల స్టాళ్లు ఏర్పాటు చేశారు. 50 రకాల మామిడి కాయలు, పండ్లు, అరటి, సపోటా, జామ, నిమ్మ, బత్తాయి పండ్లు వివిధ రకాల కూరగాయలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రారంభించారు. అన్ని స్టాళ్లను ఆయన తిలకించారు. శాస్త్రవేత్తలను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులను ఆయన అభినందించి ఉత్తమ స్టాళ్లకు బహుమతులు అందజేశారు.



50 రకాల మామిడి రకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



వివిధ రకాల మామిడి మొక్కలను ప్రదర్శనలో ఉంచిన ఉద్యాన విద్యార్థులు

డెంగీ వ్యాధిని ఓడిద్దాం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణలో భాగంగా 'మూడు పద్ధతులు పాటిద్దాం- డెంగ్యూను ఓడిద్దాం' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఉషశ్రీ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కోసం పట్టణ పురవీధుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ మూడు పద్ధతులు (పరిశీలించండి, శుభ్రపర్చండి, మూతలు పెట్టండి) పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని ఓడిద్దామని ప్రభుత్వం పిలుపునిచ్చిందన్నారు. ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలు ఒక ప్రజా ఆరోగ్య సమస్యగా ఉందని, ప్రజల్లో చైతన్యం, అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ఇంటి పరిసరాలు పాటించి నీటి నిల్వలు లేకుండా శుభ్రపర్చుకొని నీటి నిల్వలపైన మూతలు ఉంచాలని సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నినాదాలు చేస్తూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఆర్ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రాజు, సీహెచ్‌వో నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరామరాజు, మహమ్మద్‌రఫీ, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ముద్దనూరులో రోడ్డుపై ప్రవహించిన పుల్లేరు వంక



కొండాపురంలో నెలకొరిగిన విద్యుత్‌స్తంభం

కొండాపురం/ముద్దనూరు/జమ్మలమడుగు/దువ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకూలాయి. కొండాపురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో కొండాపురం, ఓబన్నపేట తదితర చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో పలు గ్రామాల్లో సుమా రు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

ముద్దనూరు మండలంలోని కొండ ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో వంకలు ప్రవహించాయి. వేల్పుచర్ల, బడుగువారిపల్లె, దేనేపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక, చెన్నారెడ్డిపల్లె సమీపంలోని వంక, వేల్పుచర్ల వద్ద వంక, అలాగే పలు వంకలు ప్రవహించాయి. పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక నీళ్లు రోడ్డుపై ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

జమ్మలమడుగులో అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జమ్మలమడుగులోని లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచింది. మోరగుడిలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా , మూడు రోడ్ల కూడలి కోవెలకుంట్లదారిలో, ఎత్తపువారి కాలనీలో తదితర చోట్ల భారీగా వర్షపునీరు నిలిచింది. అలాగే గ్రామాల్లో పలుచోట్ల గాలులకు చెట్లు విరిగిపడ్డాయి.



జమ్మలమడుగులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

దువ్వూరులో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో రైతులు అక్కడక్కడ ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మండలంలో 22.4 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. పలుచోట్ల రోడ్ల వెంట వర్షపునీరు నిలిచింది.



రోడ్డుపై ప్రవహిస్తున్న పుల్లేరు వంక



దువ్వూరు సమీపంలో తడిసిన ధాన్యం.. ఆరబోసుకుంటున్న రైతులు

గండికోట ప్రాజెక్టుకు అనుబంధంగా

కాలువల నిర్మాణం చేపట్టాలి



గండికోట ప్రాజెక్టును పరిశీలిస్తున్న రైతుసంఘం, సీపీఐ నాయకులు

కొండాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్ వంటి ప్రాజెక్టులకు నీటిని నింపడం వల్ల రైతులకు ఉపయోగం ఉండదని, రైతులు పంటలు పండించుకునే విధంగా ప్రధాన కాలువలు, పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమాలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం, సీపీఐ నాయకులతో కలిసి గండికోట ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ప్రారంభించిన పిల్ల కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. గాలేరు-నగరి ప్రాజెక్టు మొదటిదశ పనులే అసంపూర్తిగా ఉన్నాయని, అందువల్ల రెండోదశ పను లు నగరి వరకు ఎన్నిరోజుల్లో పూర్తి చేస్తారో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. గండి కోట నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో, పునరావాసం కల్పించడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పరిహారాన్ని, పునరావాసాన్ని కల్పించాలని కోరారు. జిల్లా రైతు సంఘ సంఘం అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, రైతు సంఘం, సీపీఐ నాయకులు రామాంజనేయులు, మనోహర్‌బాబు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో

డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు



గండి గురుకుల పాఠశాలలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే విధుల నుంచి తొలగి స్తామని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. తొలుత గండి గురుకుల పాఠశాలలో ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్‌ను, మారెళ్లమడక గ్రామంలో గోశాల, గోకులం షెడ్లను పరిశీలించారు. అనంతరం రైతు సాగుచేసిన ఉద్యాన, అంతర్ పంటలను పరిశీలించి రైతుకు ఆదాయం ఎంత వస్తుందని ఆరా తీశారు. ఇటీవల మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని పత్రికల్లో వార్తలు రావడంపై ఆయన మండలించారు. పనులు కావాలన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణం



శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలీయులు, నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 6వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దంపతులు, , జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి, బీజేపీ నాయకులు దేవగుడి శివనారాయణరెడ్డి, కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి పట్టణంలోని భద్రావతి, భావన్నారాయణ దేవస్థానం పద్మశాలీయులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పద్మశాలీయ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం శ్రీవారిని సర్వభూపాల వాహనంలో ఊరేగించారు. స్నపన తిరుమంజనం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామి గజవాహనంలో దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగం గా శనివారం రథోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగ్గురు పీఆర్ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల

కలికిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): గతంలో జమ్మలమడుగులో పనిచేసిన ముగ్గురు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వ గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2016-17లో జమ్మలమడుగు మండలం పి.సిరిగేపల్లెలో ఎస్టీ, ఎస్సీ కోసం ఉపాధి హామీ పథకంలో వేసిన సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం బిల్లులు చెల్లించడంలో ఈ ముగ్గురు కనీస ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినట్లు 2017 జూలై 25న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఈ ముగ్గురిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిగింది. అప్పట్లో క్యాసీ డీఈఈగా పనిచేసి ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్ఐ డీఈఈగా పనిచేస్తున్న టి. గోపాల్‌దాస్, ప్రస్తుతం కమలాపురం పీఆర్ఐ డీఈఈగా పని చేస్తున్న పి.వెంకటరావు, అప్పట్లో జమ్మలమడుగు ఏఈఈగా పనిచేసి ప్రస్తుతం అక్కడే ఇన్‌చార్జి డీఈఈగా కొనసాగుతున్న ఎస్.విజయభాస్కర్ రెడ్డిలను నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా విజిలెన్స్ గుర్తించి. పలు దఫాల విచారణ అనంతరం పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించడంలో వైఫల్యం, నియమాలను పట్టించుకోకుండా బిల్లులు చెల్లిండానికి ఈ ముగ్గురు పూర్తి బాధ్యులుగా ప్రభుత్వం నిర్ధారించింది. దుర్వినియోగమైన నిధుల రికవరీతో పాటు ముగ్గురికీ ఒక సంవత్సరం ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఎంపీడీఓపై విచారణకు ఆదేశం

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): తొండూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌పై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ విచారణకు ఆదేశించారు. గతంలో తొండూరు ఎంపీడీఓ చేసిన అక్రమాలపై ఈ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి రూ.22.65లక్షల నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎంపీడీఓ అప్పటి కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర ఓబులేసులు కలిసి ఈ నిధులను స్వాహా చేసినట్లు తెలిసింది. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంలో కొంతమేర ఈ నిధులను ప్రభుత్వానికి ఎంపీడీఓ తిరిగి చెల్లించినట్లు సమాచారం. ఎక్కడ నిధులు దుర్వినియోగం అయ్యాయో అనే అంశంపై శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పూర్తిస్థాయి విచారణ చేయాలని విచారణకు ఆదేశించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మొదట వీరు ఢిల్లీలో కూలి పనిచేశారు. అక్కడ నుంచి ఒక ఏజెన్సీ ద్వారా నంద్యాలకు వచ్చి అక్కడ పనిచేస్తూ రెండు నెలల క్రితం కడపకు వచ్చి ఐస్ అమ్ముతున్నారు. వీరి పాస్‌పోర్టు, వీసాపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిం చారు. కాగా పాస్‌పోర్టు సమయం ముగియడంతో వారి దేశానికి పంపేందుకు చర్యలు చేపట్టారు.

యువకుడిపై కేసు నమోదు

కలకడ, మే 16 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించాడంటూ మణికుమార్(26) అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన యువతి జాతర సందర్భంగా ఎర్రయ్యగారిపల్లెలోని తన మేనత్త ఇంటికి వచ్చింది. ఈ నెల 14న రాత్రి ఇంట్లో నిద్రిసున్న సమయంలో మేనత్త కుమారుడు మణికుమార్ ఆమెను భయభ్రాంతులకు గురి చేసి, లైంగిక దాడికి యత్నించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రశాంత్‌కుమార్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... గత శనివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కనంపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బైకుపై వెళ్తున్న ప్రశాంత్‌కుమార్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నాం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపేట గ్రామానికి చెందిన కందుల చంటి (31) అనే వ్యక్తి హత్యకు గురైన విషయం విదితమే. ఈ కేసులోని నిందితులను అరెస్టు చేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, చక్రాయపేట ఎస్ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. రాబడిన సమాచారం మేరకు బాలతిమ్మయ్యగారిపల్లె క్రాస్ వద్ద శుక్రవారం మధ్యాహ్నాం 12 గంటల సమయంలో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

భార్యాభర్తలపై దాడి.. కేసు నమోదు

కొండాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పొట్టిపాడు గ్రామంలో భార్యాభర్తలపై దాడి చేసిన సంఘటనలో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఓ వివాహిత రెండు నెలల నుంచి తనను పెద్దసూరి అనే వ్యక్తి ఫోన్‌లో లైంగికంగా వేధిస్తున్నాడని భర్తకు తెలిపింది. ఈ నేపథ్యంలో ఎందుకు వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు శుక్రవారం భార్యాభర్తలపై పెద్దసూరి, అతని తమ్ముడు చిన్న సూరి దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి):జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామంలో ఈనెల 4వ తేదీ ఓ ఇంటిలో బంగారు వస్తువులు చోరీ చేసిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ హైమావతి, సిబ్బంది క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించి.. వాటి ఆధారంగా అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఇడుగూరు గ్రామానికి చెందిన దాసరి నరేంద్ర, దూదేకుల చిన్నబాషలను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు హైమావతి, రామకృష్ణలు తెలిపారు.


చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేతంగా హంస వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి బ్రహ్మోత్సవాలు గత ఎని మిది రోజులుగా అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం 9వ రోజు చక్రస్నానం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి హంసవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు వసంతాలు చల్లు కుంటూ వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. తప్పెట్లు మేళ తాళాలతో మహిళల భజన సంకీర్తనల మధ్య వెల్లాలక్షేత్రం సమీపంలోని కుందూనది వద్దకు వైభవంగా సాగింది. అనంతరం సుదర్శన చక్రాన్ని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నదీజలాలతో అభి షేకించారు. రాత్రి 7గంటల సమయంలో చెన్నకేశవ ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున ధ్వజస్తంభం వద్ద ఎగుర వేసిన గరుడ పతకాన్ని అవరోహణ చేశారు. కార్యక్రమంలో ఈవో కేవీ రమణ, కమిటీ సభ్యులు గంగిరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మండల టీడీపీ నాయకులు దుద్యాల సుబ్బిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నం కిశోర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సీనియర్ అసి స్టెంటు రామ్మోహన్, అర్చకులు, పెపద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ బృందం తనిఖీలు



పశువైద్య కళాశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న వెటర్నరీ కౌన్సిల్ పరిశీలకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సహక్‌పూరేలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కళాశాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. కళాశాలలోని వివిధ విభాగాలను, పశు చికిత్సాలయం, పశుగణ క్షేత్ర సముదాయాలను పరిశీలించారు. అలాగే ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడా విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ చెంగల్వరాయలు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండి దేవస్థానాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్



గండి ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానం పనులు త్వరగా పూర్తిచేసి పునఃప్రారంభిం చాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన సహా య కమీషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునరావు, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, గోపా లస్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరి త్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. అంజన్న దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నట్లు ఇది వరకు ఫిర్యాదులు వచ్చాయని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆలయాన్ని పునఃప్రారంబిం చేందు కు ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం చక్రాయపేట మండలంలోని తహసీల్దార్ కార్యాల యాన్ని తనిఖీ చేసి అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్యపై చర్చించారు. కార్యక్రమంలో గండి దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలక మండలి సభ్యులు, టీటీపీహెచ్‌సీఎల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె తహశీల్దార్ హరినాథరెడ్డి, జడ్పీటీసీలు శివప్రసాద్ రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చక్రాయపేట ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మారెళ్లమడక సర్పంచు నరసింహులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, తొండూరు శివమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ (ఎస్‌పీకేఎం) ఇండియన్ ఇనిస్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ఈ విద్యా సంవత్సరానికి హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీలలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పీకేయం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎన్.గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం, మూడు సంవత్సరాల డిప్లమా కోర్సుతో పాటు డైరెక్టు 2వ సంవత్సరం (లాటరల్ ఎంట్రీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. వెంకటగిరిలో ఉన్న ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లుమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్నాటకలోని గడక్‌లో 4 సీట్లకు 3 సంవత్సరాల హ్యాండ్లుమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశం కోసం అవకాశాలున్నాయి. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కోర్సులకు పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై జూలై 1వ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరిలకు 15 నుండి 23 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు 25 సంవత్సరాల్లోపు ఉండాలని తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవిటి

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని పలు వీధుల్లో ఈనెల 17వ తేదీ శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11కేవీ మన్నూరు సబ్‌స్టేషన్‌లో మన్నూరు ఫీడర్ లైన్ మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకుగాను ఎర్రబల్లె, సాయినగర్, సుదర్శన్‌నగర్, మన్నూరు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

ముగిసిన రేణుకా యల్లమాంబ తిరునాళ్లు

సిద్దవటం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న రేణుకా యల్లమాంబ తిరునాళ్లు శుక్రవారం వసంతోత్సవాలతో ముగిశాయి. ఈ సందర్భంగా రేణుకాయల్లమాంబ సమేత జమదగ్ని మూలవిరాట్ ఉత్సవ విగ్రహాలను వాయిద్యాల మధ్య వసంతాలు, రంగులు పూసుకుంటూ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ గుడిలో చోరీ

వీరబల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్లి పెద్దూరు కస్పాలో ఉన్న రేణుక యల్లమ్మ గుడిలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. శుక్రవారం తెల్లవారిన తర్వాత స్థానికులు కొందరు ఈ సంఘటనను గుర్తించి వెంటనే రూరల్ సీఐ వరప్రసాద్‌కు, ఎస్ఐ మోహన్‌నాయక్‌కు సమాచారమిచ్చారు. వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గుడిలో ఉన్న హుండీని పక్కన ఉన్న పొలాల్లోకి తీసుకెళ్లి పగులగొట్టి అందులో ఉన్న నగదును దోచుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

చిన్నమండెం, మే 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం రాయచోటిలో నివాసం ఉంటున్న బోస్ గుర్రకొండ నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా అతివేగంతో వచ్చి కారు ఢీకొనడంతో అతని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ కారు డివైడర్లను ఢీకొంటూ మరో కారును కూడా ఢీకొంది. అయితే కారులో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గాయపడిన బోస్‌ను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

మూడు పద్ధతులు పాటిద్దాం.. డెంగీని ఓడిద్దాం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ ● జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీలు

రాయచోటిటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణకు మూడు పద్ధతులు పాటిద్దాం- డెంగ్యూను ఓడిద్దాం అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఉషశ్రీ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుండి పట్టణ పురవీధుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశీలించండి, శుభ్రపరచండి, మూతలు పెట్టండి అనే మూడు పద్ధతులు పాటించడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు.





రాయచోటి నందలూరులో జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి

నందలూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని డెంగ్యూ నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని మండల వైద్యాధికారులు శరత్‌కమల్, కార్తీక్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటనారాయణ, పీహెచ్ఎన్ శైలజ, సూపర్‌వైజర్ సునీల్, ఏఎన్ఎంలు, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ డెంగీ దినోత్సవం ర్యాలీ

ఓబులవారిపల్లె, మే 16(ఆంధ్రజ్యోతి): జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ముక్కావారిపల్లె వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతను పాటించడం ముఖ్యమని, ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెంద కుండా చూడాలని, అలాగే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రభుత్వ వైద్యుడు రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఓబులవారిపల్లెలో..

దోమకాటు పెనుప్రమాదం

సిద్దవటం, మే 16(ఆంధ్రజ్యోతి): దోమకాటు పెను ప్రమాదమని పి.కొత్తపల్లె వైద్యాధికారిణి రంగలక్ష్మి తెలిపారు. మండలంలోని మాచుపల్లె గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలు కుట్టడం వల్ల చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, బోదకాలు వంటివి వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్లు, ఆశావర్కర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే డెంగ్యూ దూరం

రైల్వేకోడూరు, మే 16(ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటిస్తే డెంగీకు దూరంగా ఉండవచ్చునని ప్రభుత్వ వైద్యుడు రమేష్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు ఆస్పత్రి ఆవరణం నుంచి బస్టాండు వరకు డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

ఉద్యాన యూనివర్సిటీ పరిశోధన సలహా మండలి సభ్యుడిగా ఉంగరాల క్రిష్ణ

రైల్వేకోడూరు రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): ఉద్యాన యూనివర్సిటీ పరిశోధన సలహా మండలి సభ్యుడిగా ఆదర్శ రైతు ఉంగరాల క్రిష్ణను నియమించినట్లు అనంతరాజుపేట ఉద్యాన ప్రధాన శాస్త్రవేత్త కేఎం యువరాజ్ శుక్రవారం ప్రకటించారు. ఉంగరాల క్రిష్ణ కొన్ని సంవత్సరాలుగా విన్నూతంగా వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలవడంతో ఆయనకు ఈ పదవి లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఉద్యాన యూనివర్సిటీరిజిస్ట్రార్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు ఘనంగా సన్మానించారు.

ఉద్యాన పంటల పెంపకంపై గ్రామసభ

సిద్దవటం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాకరాపేట గ్రామ సచివాలయంలో సర్పంచ్ తుర్ర చిన్నక్క అధ్యక్షతన శుక్రవారం ఉద్యాన పంటల సాగుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారులు మాట్లాడుతూ మామిడి, చీనీ, నిమ్మ, జామ, సపో, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, ఆయిల్‌పాం వంటి తదితర మొక్కలను వంద శాతం సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. ఐదెకరాలలోపు భూమి ఉన్నవారు ఉపాధిహామీ, అంతకన్న ఎక్కువ భూమి ఉన్నవారు ఉద్యానశాఖ కింద గుర్తించబడతారన్నారు. ఉపాధిహామీ కింద గులాబి మొక్కలను కూడా వంద శాతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

20న మెగా ఉద్యోగ మేళా

రాజంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 20వ తేదీన మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఉద్యోగమేళాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఇండిగో ఎయిర్‌లైన్స్, ఆద్యహెచ్‌ఆర్ సొల్యూషన్స్, నియో లింక్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, బిగ్‌సీ, ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 96037 70097, 9502527277, 8897776368 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

సుండుపల్లె, మే 16(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రాజెక్టు మేనేజర్ స్వాతి తెలిపారు. శుక్రవారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఎయిడ్స్‌పై అవగాహన సమావేశాన్ని ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ఆయూబ్‌ఖాన్, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో తిరంగా ర్యాలీ



రైల్వేకోడూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ జిల్లా యువజన నాయకుడు చిన్నిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సైనికుడు మురళీనాయక్‌కు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో మురళీనాయక్ వీరోచితంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, కూటమి నాయకులు జోగినేని మణి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, మైనార్టీ నేత పఠాన్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని వినతి

రాజంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో హిందువుల శ్మశాన వాటికకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని బీజేపీ నాయకుడు పట్టుపోగుల ఆదినారాయణ, కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హిందువులకు, ముస్లింలకు, క్రిస్టియన్లకు ఒకేసారి శ్మశానవాటికలకు స్థలాలను కేటాయించినప్పటికి హిందూ శ్మశాన వాటికలకు నిధులు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి ఎంపీ నిధుల కింద మంజూరు చేయాలని కోరారు. అనంతరం పాత్రికేయులు వెళ్లి రాజంపేటలో అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్‌కు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఎంపీ నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఈజీఏ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీప్రసాద్



రాయచోటిటౌన్, మే16(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈనెల 14వ తేదీ రాయచోటి పట్టణంలోని ఏపీఈజీఏ కార్యాలయంలో ఎన్నికల అబ్జర్వర్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కడప జిల్లా అధ్యక్షుడిగా రఘురామనాయుడు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఎన్నిక పత్రాలను రాష్ట్ర కమిటీకి పంపించడంతో పరిశీలించిన అనంతరం శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యవర్గానికి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి రథోత్సవం

పెనగలూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈటమాపురం గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా గ్రామంలోని దళితుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవవరులను పూలరథంలో కొలువుదీర్చి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం వసంతోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. శనివారం రాత్రి ఆలయ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ బత్తిన గుండాల్‌రెడ్డి, మహేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పుల్లంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి లారీ ఢీకొనడంతో మాలకొండయ్య (54) అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రకాశం జిల్లా పొనకనకట్ల మండలం చిన్నారికట్ల గ్రామానికి చెందిన మాలకొండయ్య పదేళ్లుగా పుల్లంపేటలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటల సమయంలో రోడ్డు పక్కన ఉండగా చెన్నై నుండి రాజంపేటకు అరటికాయల లోడింగ్‌కు వెళ్తున్న టీఎన్23సీక్యూ 2737 నంబరు గల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాలకొండయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతడికి భార్య, కుమారుడు, కుమార్తె కలరు. భార్య, కుమార్తె స్వగ్రామంలో ఉండగా తండ్రీకొడుకు పుల్లంపేటలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాడివేడిగా రాజంపేట మున్సిపల్ సమావేశం

● వాకౌట్ చేసి వెళ్లిపోయిన టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ● ఎమ్మెల్యే విస్మయం

రాజంపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటి కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. శుక్రవారం మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు కొందరు పలు సమస్యలపై నిలదీశారు. అందుకు చైర్మన్ సమాధానం చెప్పకపోవడంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాకౌట్ చేశారు. సమస్యలకు పరిష్కారం చూపకుండా, సమాధానం చెప్పలేనప్పుడు కౌన్సిల్ సమావేశాలు ఎందుకని పాత్రికేయుల ముందు వాపోయారు. మున్సిపాలిటీలో చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి లెక్కల్లో తేడాలు ఉండడంతో ప్రశ్నించామని, వాటికి సరైన సమాధానలు చెప్పడంలో చైర్మన్ విఫలమయ్యారని కొందరు వైసీపీ కౌన్సిలర్లు చెప్పడం ఆశ్చర్యానికి గురిచేసింది. అనంతరం జరిగిన సమావేశంలో అజెండాలో ఉన్న 50 అంశాలపై అధికారులు చదివి వినిపించి సమావేశాన్ని ముగించారు. సమస్యలు పరిష్కరించుకోకుండా ఎవరి మాటలో విని వైసీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేయడం ఏమిటని పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే ఆశ్చర్యానికి గురయ్యారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ కౌన్సిలర్లు అభివృద్ధికి సహకరించాలన్నారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునాథ్‌రెడ్డి

రైల్వేకోడూరు అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే



విద్యుత్ స్తంభాల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ముక్కా

రైల్వేకోడూరు రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ దిగవ దళితవాడ, ఎగువ దళితవాడ, మారావారిపల్లె గ్రామాల్లో రూ.50 లక్షల వ్యయంతో 80 విద్యుత్ స్తంభాలు, 100 కేవీ సామర్థ్యం గల 5 ట్రాన్స్‌ఫార్మర్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం తమ బాధ్యత అన్నారు. ప్రతి ఇంటికి విద్యుత్ సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ ప్రజలకు వెలుగులు నింపాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత పట్ల జాగ్రత్త వహించాలి



బాలికలు, మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రామాపురం, మే 16(ఆంధ్రజ్యోతి): కౌమార పిల్లలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్త వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, పద్మజ రాణి పేర్కొన్నారు. మండలంలోని రామాపురం సెక్టార్ పరిధి కర్ణపువాండ్లపల్లెలో, గువ్వలచెరువు సెక్టార్ పరిధి కొత్తరోడ్డు నారాయణపురంలో శుక్రవారం కౌమార దశలో రక్తహీనతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల్లో నెలవారి రుతుస్రావం సమయంలో కడుపులో నులిపురుగుల నివారణకు ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లు వేసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కల్యాణి, సచివాలయం మహిళా పోలీసులు రజిని, ఆరోగ్య సిబ్బంది, తల్లులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల డిమాండ్

రాయచోటిటౌన్, మే16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్ కండక్టర్ హరినాథ్‌పై దాడి చేసిన మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై కేసునమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలకరుల సమావేశంలో మాట్లాడుతూ గురువారం మదనపల్లిలో బెంగుళూరు బస్టాండు వద్ద నవాజ్‌బాషాకు సంబంధించిన ప్రైవేటు ట్రావెల్ బస్‌లోకి ప్రయాణికులను రానివ్వకుండా తన బస్‌లోకి ఎక్కువ మందిని ఎక్కించాడన్న అక్కసుతో కండక్టర్ హరినాథ్‌ను కొట్టడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బస్‌పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కిస్తే రవాణా అధికారులకి ఫిర్యాదు చేయాలి కానీ, కండక్టర్ మీద దాడి చేయడం నేరమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, కండక్టర్ మీద దాడి చేసిన మాజీ ఎమ్మెల్యేకు స్వయాన సోదరుడు కావడంతో చూసీ చూడనట్లు ఉండకుండా చట్టం ముందు అందరూ సమానులేనని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'రైల్వే ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తాం'

రైల్వేకోడూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తామని వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ చెంచురెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, పర్సనల్ డిపార్టుమెంట్ ఓఎస్ సిద్ధయ్య తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు రైల్వేస్టేషన్‌లో గ్రీవెన్స్ క్యాంపు నిర్వహించి రైల్వే ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్ల నుంచి వినతులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సమస్యలను అక్కడికిక్కడే పరిష్కరించామని తెలిపారు. గుంతకల్లు రైల్వే కార్యాలయంలో రికార్డులు పరిశీలించి తగు పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ రాజీవ్‌కుమార్‌సిన్హా, గుంతకల్లు ఆలిండియా రిటైర్డ్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జి.జయంత్‌కుమార్, సీనియర్ సెక్షన్ ఆఫీసర్ మురళీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు లేని వాహనాలపై చర్యలు తప్పవు

చిన్నమండెం, మే16(ఆంధ్రజ్యోతి): రికార్డు లేని వాహనాలను నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం కడప-బెంగుళూరు జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో వాహనాల రికార్డులను పరిశీలించారు. హెల్మెట్ లేని వారికి జరిమానా విధించారు. మరోసారి రికార్డులు లేకుండా తిరిగినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ వాడకంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



రాజంపేట టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో రూ.20లక్షలతో కొనుగోలు చేసిన నూతన చెత్త సేకరణ ట్రాక్టర్లను శుక్రవారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలు చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటివద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు అందజేసి స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుక్క కడుపులో ఏనుగు పిల్ల?!

● చూసేందుకు ఎగబడిన జనం



బూచిపల్లెలో ఏనుగు ఆకారంలో పుట్టి మృతిచెందిన కుక్కపిల్ల

పెద్దతిప్పసముద్రం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏనుగు ఆకారంలో కుక్క పిల్ల జన్మించడంతో దానిని చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలోని బూచిపల్లెలో చోటుచేసుకుంది. సదరు గ్రామానికి చెందిన నరసింహులు పెంచుకుంటున్న ఓ కుక్క గురువారం మూడు కుక్క పిల్లలకు జన్మనిచ్చింది. ఇందులో ఓ పిల్ల ఏనుగు ఆకారంలో ఉండడం ఆసక్తి రేపింది. ఈ విషయం గ్రామంలో దావానంలా వ్యాపించడంతో చూసేందుకు జనం ఎగబడ్డారు. అయితే ఆ పిల్ల పుట్టిన కొద్దిసేపటికే మృతి చెందడంతో అంత్యక్రియలు చేశారు.

ఆలస్యంగా నరసాపూర్ - కదిరి ఎక్స్‌ప్రెస్

● నాలుగు గంటలకు పైగా ప్రయాణికుల అవస్థలు

ములకలచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. నాలుగు గంటలకుపైగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాంకేతిక కారణాలతో ఈ రైలు చీరాలలో రెండు గంటలకుపైగా నిలిచిపోయింది. దీంతో ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సిన రైలు ఉదయం 11.17 గంటలకు వచ్చింది. తిరుపతికి తెల్లవారుజామున 4.15కు రావాల్సి ఉండగా ఉదయం 8.17 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 5.39కి రావాల్సి ఉండగా 9.52కు, కలికిరికి తెల్లవారుజామున 5.54కు రావాల్సి ఉండగా ఉదయం 10.10కి, మదనపల్లె రోడ్‌కు ఉదయం 6.19కి రావాల్సి ఉండగా ఉదయం 10.39 గంటలకు వచ్చింది. కదిరికి ఉదయం 7.39 గంటలకు వెళ్లాల్సిన రైలు ఉదయం 11.49 గంటలకు వెళ్లింది. దీంతో ప్రయాణికులు స్టేషన్లలో గంటల తరబడి వేచి చూశారు. రైలులో ప్రయాణిస్తున్న వారు గమ్యస్థానాలకు చేరేలోగా చుక్కలు కన్పించాయి. ప్రతి రోజు ఈ రైలు నరసాపూర్ నుంచి ధర్మవరం వరకు నడుస్తుండగా ధర్మవరంలో ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా కొన్ని రోజులుగా కదిరి వరకే నడుస్తోంది.

ఆలయాల అభివృద్ధే లక్ష్యం

● దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్

నిమ్మనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధి దేవదాయ శాఖ ముఖ్య ఉద్దేశమని జిల్లా దేవదాయ శాఖ అధికారి విశ్వనాథ్ అన్నారు. మండలంలో ఆ శాఖ ఆధ్వర్యంలో పునర్నిస్తున్న ఆలయాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తవళం గ్రామంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.3.17 కోట్లు కేటాయించగా, మొదటి విడతలో కోటి రూపాయల విలువపైన పనులు పూర్తయ్యాయన్నారు. రెండత విడత నిధులు త్వరలోనే మంజూరవుతాయన్నారు. బొంతవారిపల్లి వీరభద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు కాగా వాటి పనులు కూడా దాదాపు పూర్తయ్యాయన్నారు. అనంతరం రాచవేటివారిపల్లిలోని మృత్యుంజయ శివాలయంలో ధూపదీప కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మదనపల్లెఅర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి అని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. మదనపల్లె మండలం, బసినికొండ పంచాయతీ, పుంగనూరు బైపాస్ రోడ్డు, వై జంక్షన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, మదనపల్లె డీఎస్పీ మహేంద్ర వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రోడ్డు భద్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మానపల్లెలో వాహన చోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపిన మైనర్ల తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రతి పోలీసు స్టేసన్ పరిధిలో సుమారు 200 మంది వాహనచోదకులపై కేసులు నమోదు చేశామన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయారాదని సూచించారు. కార్యక్రమంలో తాలూకా సీఐ కళా వెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్, పోలీసులు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం

గర్నిమిట్ట యల్లమ్మ



గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం

● నేటి నుంచి అమ్మవారి జాతర

● చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

పీలేరు, మే 16(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం గర్నిమిట్టలో వెలసిన యల్లమ్మ అమ్మవారు భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంలా విరాజిల్లుతోంది. కేవీపల్లె, గర్నిమిట్ట గ్రామాలకు గ్రామ దేవత అయిన యల్లమ్మ సంతాన ప్రదాయినిగా, విద్య, ఉద్యోగ, ఉపాధి మార్గాలను అనుగ్రహించే దేవతగా ఈ ప్రాంత ప్రజల నమ్మిక. కేవలం కేవీపల్లె మండలమే కాకుండా పొరుగున ఉన్న పీలేరు, సుండుపల్లె, సంబేపల్లె, కలకడ, కలికిరి, రొంపిచెర్లతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా అమ్మవారికి భక్తులు ఉండడం విశేషం. పీలేరు పరిసర ప్రాంతాల్లో అమ్మవారికి చాందినీ బండ్ల ద్వారా మొక్కులు తీర్చుకునే ఆచారం యల్లమ్మ జాతర ద్వారానే ప్రారంభం కావడం మరో విశేషం. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి అనంతరం వచ్చే ఆదివారం అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈ శని, ఆది, సోమవారాల్లో అమ్మవారి జాతర జరుగుతోంది. జాతరను ఘనంగా నిర్వహించేందుకు అటు భక్తులు, ఇటు ఆలయ నిర్వాహక కమిటీ పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.





ప్రత్యేక అలంకరణలో యల్లమ్మ అమ్మవారు, 300 ఏళ్లుగా పూజలందుకుంటున్న అమ్మవారి రాయి

ఆలయ చరిత్ర

గర్నిమిట్ట యల్లమ్మ ఆలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వారి కథనం మేరకు సుమారు 300 ఏళ్ల క్రితం గర్నిమిట్ట కస్పాలో ఓ యాదవ కుటుంబం ఉండేది. వీరి పశువుల పాకలో ఆ ఇంటి యజమాని నిత్యం తన పశువులకు గ్రాసం వేసి మేపుకునేవాడు. ఆ క్రమంలో ఒకరోజు ఆయన పశుగ్రాసం గాటిలో ఓ నల్లటి రాయి కనిపించింది. ఏదో రాయి అనుకుని ఆయన దానిని తీసి పక్కన పడేశాడు. మరుసటి రోజు కూడా అదే రాయి అదే గాటిలో కనిపించడంతో మరలా పక్కన పడేశాడు. వారం రోజులు ఇదే తంతు కొనసాగడంతో ఆయన చిరాకు పడి ఆ రాయిని కోపంతో గోడ కేసి విసిరి కొట్టగా ఆ రాయి నుంచి రక్తం రావడంతో దానిని మాయగా భావించాడు. అదే రోజు రాత్రి ఆయనకు కలలో ఓ దేవత వచ్చి తాను రోజూ కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదని, తనను గ్రామదేవతగా కొలిస్తే గ్రామాన్ని చల్లగా కాపాడుతానని చెప్పింది. దీంతో ఆయన ప్రస్తుతం ఆలయం ఉన్న చోట ఆ రాయిని ప్రతిష్ఠించి పూజలు చేయడం ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామస్తులు అమ్మవారిని కొలుస్తూ ప్రతి ఏటా జాతర నిర్వహిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకూ ఆ యాదవ కుటుంబానికి చెందిన వారే పూజారులుగా కొనసాగుతున్నారు.

చాందినీ బండ్ల ఊరేగింపునకు పెట్టింది పేరు

చెట్టు కింద చిన్న రాయిగా ప్రారంభమైన యల్లమ్మ వైభవం కాలక్రమంలో ఆలయంగా రూపాంతరం చెందింది. సంతానం, విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి అంశాల్లో నమ్మిన వారికి నమ్మినట్లు అనుగ్రహించడంతో గర్నిమిట్ట, కేవీపల్లెతో పాటు కేవీపల్లె మండల వ్యాప్తంగా అమ్మవారిపై ప్రజలకు భక్తివిశ్వాసాలు పెరిగాయి. అమ్మవారికి మొక్కుకున్న వారు తమ కోరికలు తీరిన అనంతరం కృతజ్ఞతగా జాతర సందర్భంగా చాందినీ బండ్లు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. పీలేరు పరిసర ప్రాంతాల్లో చాందినీ బండ్ల వైభవం గర్నిమిట్ట జాతరతోనే మొదలైందని చెప్పవచ్చు. ఒకప్పుడు వందకు పైగా ఇక్కడ చాందినీ బండ్లు వచ్చేవి. ఇటీవల చాందినీ బండ్ల సంఖ్య తగ్గినప్పటికీ గత ఏడాది కూడా దాదాపు 50 బండ్లు వచ్చాయి. ఈ ఏడాది వాటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భక్తులు తెలిపారు. కేవీపల్లె మండల వాసులే కాకుండా వ్యాపారం కోసం ఈ ప్రాంతానికి వచ్చిపోయే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారులు కూడా అమ్మవారి భక్తులుగా మారారని, జాతర కోసం వారందరూ తరలి వస్తారని గర్నిమిట్ట వాసులు తెలిపారు.

నేటి నుంచి జాతర

యల్లమ్మ అమ్మవారి జాతర శనివారం నుంచి సోమవారం దాకా మూడు రోజులపాటు జరుగుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు సురేశ్‌రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి జాగారం, ఆదివారం బోనాల సమర్పణ, రాత్రి చాందినీ బండ్ల ఊరేగింపు, సోమవారం మొక్కుబడుల చెల్లింపులు ఉంటాయని ఆయన వివరించారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. రికార్డు డ్యాన్సులు, మోతాదుకు మించి డీజేలు ఉండకూడదని ఎస్ఐ చిన్న రెడ్డప్ప ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.

వ్యాసరచనతో పిల్లల్లో సృజనాత్మకత : కలెక్టర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 16 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన వల్ల పిల్లల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంపొందుతుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ద హీట్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థినీ, విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లను, మెమెంటోలను, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి నెల మూడవ శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం థీమ్ బీట్ ద హీట్ అనే అంశంపై జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, చిత్రలేఖనంలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థినీ, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పోటీలను ఈ నెల 15న నిర్వహించామని, మొత్తం 24 మంది పాల్గొన్నట్లు తెలిపారు. ఇందులో వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన నికిత రెడ్డి, చిత్రలేఖనంలో మొదటి బహుమతి రాయచోటి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన భవ్య అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, ఆ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భరతమాత కోసం దేశపౌరులందరూ సిద్ధం

● తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



తిరంగా ర్యాలీలో పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

మదనపల్లెటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): భారతదేశం కోసం త్యాగాలు చేయడానికి దేశపౌరులందరూ సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శుక్రవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పెద్దఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్, జనసేన నాయకురాలు దారం అనిత పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైనికుల పోరాటపటిమతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మదనపల్లెకు గొప్ప పేరుందన్నారు. అలాంటి మదనపల్లెలో తిరంగా ర్యాలీ నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేశ్ మాట్లాడుతూ పౌరులందరు సురక్షితంగా ఉండాలని సరిహద్దుల్లో సైనికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. పీఎం నరేంద్రమోదీ, సైనికులకు సంఘీభావంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ర్యాలీ ప్రభుత్వాస్పత్రి, బీసెంట్ సర్కిల్, బెంగళూరు బస్టాండు మీదుగా చిత్తూరు బస్టాండు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జె వెంకటేశ్ బీజేపీ సీనియర్ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, యల్లంపల్లె ప్రశాంత్, భగవాన్, టౌన్‌బ్యాంకు చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, మార్పురి శశిధర్‌నాయుడు, ఆర్‌కే రామకృష్ణాచారి, ఎస్‌ఏ మస్తాన్, పఠాన్ ఖాదర్‌ఖాన్, కలకడ వేణు, చిన్ని, బీజేపీ, జనసేన నాయకులు, పెద్దసంఖ్యలో మహిళలు త్రివర్ణ పతాకాలు చేతపట్టి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు అమర్చితేనే నిధులు

● వైఎస్‌ఆర్ కడప జిల్లా జాయింట్ కలెక్టర్



ఎంఐజీ లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కడప జేసీ అదితిసింగ్

రాయచోటిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో ఉన్న ఎంఐజీ లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలను ఎలాపడితే అలా కాకుండా సక్రమంగా అమర్చితేనే నిధులు మంజూరు చేస్తామని వైఎస్సార్ కడప జిల్లా జేసీ, అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ వీసీ అదితిసింగ్ సంబంధిత అధికారులను హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఎంఐజీ లేఅవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న 298 ఇంటి స్థలాలకు సంబంధించిన అభివృద్ధి పనులపై ఆరా తీసి లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించారు. అలాగే ఎంఐజీ లేఅవుట్ డ్రైనేజ్ సిస్టం సరిగ్గా లేదని, విద్యుత్ స్తంభాలు సక్రమంగా ఏర్పాటు చేయాల్సి ఉందని సంబంధిత అధికారులను, సిబ్బందిని హెచ్చరించారు. అలాగే రెండో విడత ఎంఐజీ లేఅవుట్‌కు సంబంధించిన నివేదికలను వీలైనంత త్వరగా పంపించాలని రాయచోటి తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు.

పక్కా గృహాలు పూర్తి చేయండి : పీడీ

సిద్దవటం, మే 16 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రాజారత్నం తెలిపారు. మండలంలోని మాధవరం-1 ఎస్‌కేఆర్ నగర్‌లో పక్కా గృహాల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్‌కేఆర్ నగర్‌లో 2019-20లో మంజూరైన గృహాలు త్వరగా నిర్మించడానికి కాంట్రిబ్యూషన్ కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు ఒక్కొరికి రూ.50 వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తామని, నిర్మాణ పనులు జూన్ 10లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు. ఆయా జిల్లాల్లో సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై తరచూ సూచనలు, హెచ్చరికలు చేసినా వారిలో మార్పు రాలేదని, అందుకే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని అధికార వర్గాలు తెలిపాయి.

డెంగీ వ్యాధిని ఓడిద్దాం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి నివారణలో భాగంగా 'మూడు పద్ధతులు పాటిద్దాం- డెంగ్యూను ఓడిద్దాం' అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఉషశ్రీ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నుంచి డెంగ్యూ వ్యాధిపై అవగాహన కోసం పట్టణ పురవీధుల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ మూడు పద్ధతులు (పరిశీలించండి, శుభ్రపర్చండి, మూతలు పెట్టండి) పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని ఓడిద్దామని ప్రభుత్వం పిలుపునిచ్చిందన్నారు. ప్రస్తుతం డెంగ్యూ జ్వరాలు ఒక ప్రజా ఆరోగ్య సమస్యగా ఉందని, ప్రజల్లో చైతన్యం, అవగాహనతోనే దోమల నియంత్రణ సాధ్యమన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తూ ఇంటి పరిసరాలు పాటించి నీటి నిల్వలు లేకుండా శుభ్రపర్చుకొని నీటి నిల్వలపైన మూతలు ఉంచాలని సూచించారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నినాదాలు చేస్తూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నేతాజీ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ జాతీయ డెంగ్యూ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఆర్‌ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రాజు, సీహెచ్‌వో నారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్స్ బలరామరాజు, మహమ్మద్‌రఫీ, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రైతే దేశానికి వెన్నెముక

● కిసాన్‌మేళాలో ఎమ్మెల్యే, విప్ శ్రీధర్

రైల్వేకోడూరు, మే 16(ఆంధ్రజ్యోతి): రైతే దేశానికి వెన్నెముక అని జనసేన పార్టీ ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణలో కిసాన్‌మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఉద్యాన రైతులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇస్తుందన్నారు. నాణ్యమైన ఉత్పత్తులతో లాభాలను రైతులు పొందాలని, ఉద్యాన హబ్‌గా రైల్వేకోడూరును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతం ఉద్యాన పంటలకు కేంద్ర బిందువుగా ఉన్నదని బ్రిటీష్ కాలంలోనే గుర్తించి 1935లోనే ఉద్యాన పరిశోధనా స్థానం ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల సేవలో ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఉన్నారని తెలిపారు. అలాగే ఇక్కడ జ్యూస్‌పరిశ్రమ కూడా ఏర్పాటు చేశారన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని రైతులు మంచి నాణ్యమైన పండ్ల తోటలను సాగు చేసి లాభాలు పొందాలన్నారు. ఉద్యాన వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వేకోడూరు పండ్లతోటల సాగులో కాకుండా కూరగాయలు, ఇతర ఉద్యాన పంటలను రైతులు పండిస్తున్నారని తెలిపారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులు అందిచేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పండ్లు, కూరగాయల ఉత్పత్తులు నాణ్యత ప్రమాణాలు బాగుంటటే ఇతర దేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తద్వారా రైతులు మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. అలాగే విలువ ఆధారిత ఉత్పత్తుల పై రైతులు దృష్టి సారించాలన్నారు. రాయలసీమ జోన్ ఏడీఆర్ డాక్టర్ మధుమతి మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగులో ఖర్చు తగ్గించుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ కేఎం యువరాజ్ మాట్లాడుతూ 1935లో ఏర్పాటైన ఉద్యాన పరిశోధన స్థానం 90 ఏళ్ల రైతుల కోసం విశిష్టమైన సేవలు అందిస్తుందన్నారు. నిమ్మ, బొప్పాయి, మామిడి తదితర వాటి పై పరిశోధనల్లో పురోగతి సాధించినట్లు తెలిపారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. అనంతరాజుపేట అసోసియేట్ డీన్ పీటీ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు రైతులకు అన్ని విధాల సహకారం అందిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన పరిశోధనను చేస్తున్నామని గుర్తు చేశారు. పులివెందుల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ ఆర్.నాగరాజు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పంటల సాగును రైతులు సాగు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీ కే.కవిత మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుతో పాటు చిరుధాన్యాలు, నూనెగింజలు, పప్పుదినుసులు పంటలను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, శాస్త్రవేత్తలు డాక్టర్ సందీప్‌నాయక్, డాక్టర్ యోహాన్, డాక్టర్ వై.పుష్పావతి, డాక్టర్ జీ.రాజేశ్వరి, డాక్టర్ రూత్‌బెనర్జీ, డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ రామయ్య, డాక్టర్ గిరిధర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ కె.లలిత, డాక్టర్ ముకుందలక్ష్మీ, డాక్టర్ వై.శిరీషా, డాక్టర్ వై.దీప్తికిరణ్, ఆదర్శ రైతులు బుర్రు సుబ్రహ్మణ్యం, వెంకట్రామరాజు, ఉంగరాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



50 రకాల మామిడి రకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్



వివిధ రకాల మామిడి మొక్కలను ప్రదర్శనలో ఉంచిన ఉద్యాన విద్యార్థులు

ఆకట్టుకున్న ఉత్పత్తుల ప్రదర్శన

కిసాన్‌మేళా సందర్భంగా కూరగాయలు, పండ్లు, మొక్కలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, పప్పుదినుసులు, జీవన ఎరువుల స్టాళ్లు ఏర్పాటు చేశారు. 50 రకాల మామిడి కాయలు, పండ్లు, అరటి, సపోటా, జామ, నిమ్మ, బత్తాయి పండ్లు వివిధ రకాల కూరగాయలతో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రారంభించారు. అన్ని స్టాళ్లను ఆయన తిలకించారు. శాస్త్రవేత్తలను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులను ఆయన అభినందించి ఉత్తమ స్టాళ్లకు బహుమతులు అందజేశారు.

గాలివాన బీభత్సం

- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ముద్దనూరులో రోడ్డుపై ప్రవహించిన పుల్లేరు వంక


కొండాపురంలో నెలకొరిగిన విద్యుత్‌స్తంభం

కొండాపురం/ముద్దనూరు/జమ్మలమడుగు/దువ్వూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): గాలివాన బీభత్సంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు నేలకూలాయి. కొండాపురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున గాలివాన బీభత్సం సృష్టించింది. దీంతో కొండాపురం, ఓబన్నపేట తదితర చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో పలు గ్రామాల్లో సుమా రు నాలుగైదు గంటలు విద్యుత్ సరఫరా నిలిచి పోయింది.

ముద్దనూరు మండలంలోని కొండ ప్రాంతాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో వంకలు ప్రవహించాయి. వేల్పుచర్ల, బడుగువారిపల్లె, దేనేపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక, చెన్నారెడ్డిపల్లె సమీపంలోని వంక, వేల్పుచర్ల వద్ద వంక, అలాగే పలు వంకలు ప్రవహించాయి. పులివెందుల రహదారిలోని పుల్లేరు వంక నీళ్ల రోడ్డుపై ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. 13.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

జమ్మలమడుగులో అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో జమ్మలమడుగులోని లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన రోడ్లపై వర్షపునీరు నిలిచింది. మోరగుడిలోని ఆంజనేయస్వామి గుడి ఎదురుగా , మూడు రోడ్ల కూడలి కోవెలకుంట్లదారిలో, ఎత్తపువారి కాలనీలో తదితర చోట్ల భారీగా వర్షపునీరు నిలిచింది. అలాగే గ్రామాల్లో పలుచోట్ల గాలులకు చెట్లు విరిగిపడ్డాయి.

దువ్వూరులో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. దీంతో రైతులు అక్కడక్కడ ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మండలంలో 22.4 మి.మీ. వర్షపాతం నమోదు అయింది. పలుచోట్ల రోడ్ల వెంట వర్షపునీరు నిలిచింది.


రోడ్డుపై ప్రవహిస్తున్న పుల్లేరు వంక


దువ్వూరు సమీపంలో తడిసిన ధాన్యం.. ఆరబోసుకుంటున్న రైతులు


జమ్మలమడుగులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

గండికోట ప్రాజెక్టుకు అనుబంధంగా
కాలువల నిర్మాణం చేపట్టాలి


గండికోట ప్రాజెక్టును పరిశీలిస్తున్న రైతుసంఘం, సీపీఐ నాయకులు

కొండాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి) గండికోట ప్రాజెక్టు నుంచి వామికొండ, సర్వరాయసాగర్ వంటి ప్రాజెక్టులకు నీటిని నింపడం వల్ల రైతులకు ఉపయోగం ఉండదని, రైతులు పంటలు పండించుకునే విధంగా ప్రధాన కాలువలు, పిల్ల కాలువల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి జమాలయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం రైతు సంఘం, సీపీఐ నాయకులతో కలిసి గండికోట ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ప్రభుత్వం ప్రారంభించిన పిల్ల కాల్వల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. గాలేరు-నగరి ప్రాజెక్టు మొదటిదశ పనులే అసంపూర్తిగా ఉన్నాయని, అందువల్ల రెండోదశ పను లు నగరి వరకు ఎన్నిరోజుల్లో పూర్తి చేస్తారో అంతుచిక్కని పరిస్థితి ఏర్పడిందన్నారు. గండి కోట నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో, పునరావాసం కల్పించడంలో గత ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి పరిహారాన్ని, పునరావాసాన్ని కల్పించాలని కోరారు. జిల్లా రైతు సంఘ సంఘం అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, రైతు సంఘం, సీపీఐ నాయకులు రామాంజనేయులు, మనోహర్‌బాబు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడితే వేటు తప్పదు

డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి


గండి గురుకుల పాఠశాలలో ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న పీడీ ఆదిశేషారెడ్డి

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే విధుల నుంచి తొలగి స్తామని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన పర్యటించారు. తొలుత గండి గురుకుల పాఠశాలలో ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్‌ను, మారెళ్లమడక గ్రామంలో గోశాల, గోకులం షెడ్లను పరిశీలించారు. అనంతరం రైతు సాగుచేసిన ఉద్యాన, అంతర్ పంటలను పరిశీలించి రైతుకు ఆదాయం ఎంత వస్తుందని ఆరా తీశారు. ఇటీవల మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని పత్రికల్లో వార్తలు రావడంపై ఆయన మండలించారు. పనులు కావాలన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణం


శ్రీవారికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న పద్మశాలీయులు, నారాపురం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జమ్మలమడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం 6వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దంపతులు, , జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి భార్గవి, బీజేపీ నాయకులు దేవగుడి శివనారాయణరెడ్డి, కూటమి నాయకులు గోనా పురుషోత్తంరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవానికి పట్టణంలోని భద్రావతి, భావన్నారాయణ దేవస్థానం పద్మశాలీయులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పద్మశాలీయ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం శ్రీవారిని సర్వభూపాల వాహనంలో ఊరేగించారు. స్నపన తిరుమంజనం, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామి గజవాహనంలో దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాలలో భాగం గా శనివారం రథోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ముగ్గురు పీఆర్ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల

కలికిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): గతంలో జమ్మలమడుగులో పనిచేసిన ముగ్గురు పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లకు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ ప్రభుత్వ గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2016-17లో జమ్మలమడుగు మండలం పి.సిరిగేపల్లెలో ఎస్టీ, ఎస్సీ కోసం ఉపాధి హామీ పథకంలో వేసిన సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం బిల్లులు చెల్లించడంలో ఈ ముగ్గురు కనీస ప్రమాణాలు కూడా పాటించకపోవడంతో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం జరిగినట్లు 2017 జూలై 25న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి ఈ ముగ్గురిపై వచ్చిన అభియోగాలపై విచారణ జరిగింది. అప్పట్లో క్యాసీ డీఈఈగా పనిచేసి ప్రస్తుతం ప్రొద్దుటూరు పీఆర్‌ఐ డీఈఈగా పనిచేస్తున్న టి. గోపాల్‌దాస్, ప్రస్తుతం కమలాపురం పీఆర్‌ఐ డీఈఈగా పని చేస్తున్న పి.వెంకటరావు, అప్పట్లో జమ్మలమడుగు ఏఈఈగా పనిచేసి ప్రస్తుతం అక్కడే ఇన్‌చార్జి డీఈఈగా కొనసాగుతున్న ఎస్.విజయభాస్కర్ రెడ్డిలను నిధుల దుర్వినియోగానికి బాధ్యులుగా విజిలెన్స్ గుర్తించి. పలు దఫాల విచారణ అనంతరం పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించడంలో వైఫల్యం, నియమాలను పట్టించుకోకుండా బిల్లులు చెల్లిండానికి ఈ ముగ్గురు పూర్తి బాధ్యులుగా ప్రభుత్వం నిర్ధారించింది. దుర్వినియోగమైన నిధుల రికవరీతో పాటు ముగ్గురికీ ఒక సంవత్సరం ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ గురువారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఎంపీడీఓపై విచారణకు ఆదేశం

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): తొండూరు ఎంపీడీఓగా పనిచేస్తున్న కృష్ణప్రసాద్‌పై పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ విచారణకు ఆదేశించారు. గతంలో తొండూరు ఎంపీడీఓ చేసిన అక్రమాలపై ఈ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. 15వ ఫైనాన్స్ కమిషన్‌కు సంబంధించి రూ.22.65లక్షల నిధులు స్వాహా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎంపీడీఓ అప్పటి కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర ఓబులేస్‌లు కలిసి ఈ నిధులను స్వాహా చేసినట్లు తెలిసింది. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంలో కొంతమేర ఈ నిధులను ప్రభుత్వానికి ఎంపీడీఓ తిరిగి చెల్లించినట్లు సమాచారం. ఎక్కడ నిధులు దుర్వినియోగం అయ్యాయో అనే అంశంపై శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పూర్తిస్థాయి విచారణ చేయాలని విచారణకు ఆదేశించారు.

పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు

కడప క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీసుల అదుపులో ఇద్దరు విదేశీయులు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మొదట వీరు ఢిల్లీలో కూలి పనిచేశారు. అక్కడ నుంచి ఒక ఏజెన్సీ ద్వారా నంద్యాలకు వచ్చి అక్కడ పనిచేస్తూ రెండు నెలల క్రితం కడపకు వచ్చి ఐస్ అమ్ముతున్నారు. వీరి పాస్‌పోర్టు, వీసాపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిం చారు. కాగా పాస్‌పోర్టు సమయం ముగియడంతో వారి దేశానికి పంపేందుకు చర్యలు చేపట్టారు.

యువకుడిపై కేసు నమోదు

కలకడ, మే 16 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడికి యత్నించాడంటూ మణికుమార్(26) అనే యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. కలికిరి మండలం అద్దవారిపల్లెకు చెందిన యువతి జాతర సందర్భంగా ఎర్రయ్యగారిపల్లెలోని తన మేనత్త ఇంటికి వచ్చింది. ఈ నెల 14న రాత్రి ఇంట్లో నిద్రిసున్న సమయంలో మేనత్త కుమారుడు మణికుమార్ ఆమెను భయభ్రాంతులకు గురి చేసి, లైంగిక దాడికి యత్నించాడని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పులివెందుల, మే 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రశాంత్‌కుమార్ (30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... గత శనివారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో కనంపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బైకుపై వెళ్తున్న ప్రశాంత్‌కుమార్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఐదుగురికి గాయాలు

నిమ్మనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఆటోని ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు వెంగంవారిపల్లి పంచాయతీ సింగంవారిపల్లికి చెందిన షేక్‌రెడ్డిబాషా (42) అతని భార్య షేక్ తాజున్(35) కుమారుడు ఇమ్రాన్(16), కుమార్తె ఆసిఫా(14) మదనపల్లిలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. శుక్రవారం నిమ్మనపల్లిలోని సయ్యద్‌షావలి కట్ట ఉరుసుకు వచ్చిన వారు, సింగంవారిపల్లికి ఆటోలో వెళుతుండగా సైదాపేట వద్ద వున్న మలుపులో కందూరు నుంచి మదనపల్లికి వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో ఆటోలోని నలుగురితో పాటు ఆటో డ్రైవర్ ముస్తఫారెడ్డికి కూడా తీవ్రగా యాలయ్యాయి. ఈ ప్రమాదంలో ఇమ్రాన్‌కు కాలు ఫ్రాక్చరైంది. క్షతగాత్రులను నిమ్మనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరు గైన వైద్యం కోసం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం రాయుళ్లు అరెస్టు

- భారీ మొత్తంలో నగదు స్వాధీనం

కలకడ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లెకు సమీపంలో ఉన్న మామిడితోటలో నిర్వహిస్తున్న కోడిపందెం కేంద్రంపై శుక్రవారం మెరుపు దాడులు చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు సీఐ గురునాథ్ తెలిపారు. వారి నుంచి రూ.2,83,350 నగదు, నాలుగు కోళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో నాగేశ్వరనాయుడు, హేమచంద్ర, చంద్రబాబు, ప్రభుకుమార్, ముబారక్, శివకుమార్, భాస్కర్‌నాయుడు, భూపతి, రాజన్న ఉన్నారని వివరించారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమటిపేట గ్రామానికి చెందిన కందుల చంటి (31) అనే వ్యక్తి హత్య కేసులోని నిందితులను అరెస్టు చేసినట్లు ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య, చక్రాయపేట ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు తెలిపారు. బాల తిమ్మయ్యగారిపల్లె క్రాస్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు


శ్రీదేవి భూదేవి సమేతంగా హంస వాహనంపై ఊరేగుతున్న చెన్నకేశవుడు

రాజుపాలెం, మే 16 (ఆంధ్రజ్యోతి): వెల్లాల చెన్నకేశవ సంజీవ రాయస్వామి బ్రహ్మోత్సవాలు గత ఎని మిది రోజులుగా అంగరంగ వైభవంగా జరిగాయి. శుక్రవారం 9వ రోజు చక్రస్నానం, వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి హంసవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు వసంతాలు చల్లు కుంటూ వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. తప్పెట్లు మేళ తాళాలతో మహిళల భజన సంకీర్తనల మధ్య వెల్లాలక్షేత్రం సమీపంలోని కుందూనది వద్దకు వైభవంగా సాగింది. అనంతరం సుదర్శన చక్రాన్ని అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నదీజలాలతో అభి షేకించారు. రాత్రి 7గంటల సమయంలో చెన్నకేశవ ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున ధ్వజస్తంభం వద్ద ఎగుర వేసిన గరుడ పతకాన్ని అవరోహణ చేశారు. కార్యక్రమంలో ఈవో కేవీ రమణ, కమిటీ సభ్యులు గంగిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మండల టీడీపీ నాయకులు దుద్యాల సుబ్బిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్నం కిశోర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సీనియర్ అసి స్టెంటు రామ్మోహన్, అర్చకులు, పెపద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ బృందం తనిఖీలు


పశువైద్య కళాశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న వెటర్నరీ కౌన్సిల్ పరిశీలకులు

ప్రొద్దుటూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం సభ్యులు డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సహక్‌పూరేలు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు కళాశాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసినట్లు తెలిపారు. కళాశాలలోని వివిధ విభాగాలను, పశు చికిత్సాలయం, పశుగణ క్షేత్ర సముదాయాలను పరిశీలించారు. అలాగే ల్యాబ్‌లు, లైబ్రరీ, క్రీడా విభాగాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతి గృహాలను పరిశీలించి కళాశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ చెంగల్వరాయలు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండి దేవస్థానాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయండి : కలెక్టర్


గండి ఆలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

చక్రాయపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానం పనులు త్వరగా పూర్తిచేసి పునఃప్రారంభిం చాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన సహా య కమీషనర్ వెంకటసుబ్బయ్య, జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జునరావు, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, వేద పారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, గోపా లస్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చరి త్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులపై ఆరా తీశారు. అంజన్న దర్శనం కోసం భక్తులు ఎదురు చూస్తున్నట్లు ఇది వరకు ఫిర్యాదులు వచ్చాయని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఆల యాన్ని పునఃప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. అనంతరం చక్రాయపేట మండలంలోని తహసీల్దార్ కార్యాల యాన్ని తనిఖీ చేసి అక్కడ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి నీటి సమస్యపై చర్చిం చారు. కార్యక్రమంలో గండి దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకట స్వామి, పాలక మండలి సభ్యులు, టీటీపీహెచ్‌సీ ఎల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వేంపల్లె తహసీల్దార్ హరినాథరెడ్డి, జడ్పీటీసీలు శివప్రసాద్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చక్రాయపేట ఎంపీపీ మాధవి బాలకృష్ణ, మారెళ్లమడక సర్పంచు నరసింహులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్, తొండూరు శివమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎన్జీఆర్ సర్కిల్, మే 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ (ఎస్‌పీకేఎం) ఇండియన్ ఇనిస్టిట్యూట్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ఈ విద్యా సంవత్సరానికి హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ టెక్నాలజీలలో డిప్లమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌పీకేయం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎన్.గిరిధర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం, మూడు సంవత్సరాల డిప్లమా కోర్సుతో పాటు డైరెక్టు 2వ సంవత్సరం (లాటరల్ ఎంట్రీ)లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన వివరించారు. వెంకటగిరిలో ఉన్న ఎస్‌పీకేఎం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్నాటకలోని గడక్‌లో 4 సీట్లకు 3 సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లమా కోర్సులో ప్రవేశం కోసం అవకాశాలున్నాయి. ఈ మేరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కోర్సులకు పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై జూలై 1వ తేదీ నాటికి బీసీ, జనరల్ కేటగిరిలకు 15 నుండి 23 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు 25 సంవత్సరాల్లోపు ఉండాలని తెలిపారు.

గంగమ్మ జాతర ప్రారంభం

వాల్మీకిపురం, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని నల్లవీరగంగాభవాని అమ్మవారికి జాతరలో భాగంగా శుక్రవారం ఉదయం అభిషేకం, అర్చన, తోమాలసేవ నిర్వహించారు. జాతర చాటింపు పాలపొంగు దేవర, ధ్వజారోహణం, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలంకరణలు, విశేష ఏర్పాటతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఆనంద శెట్టి, రమణారెడ్డి, బలరాం, అర్చకులు జనార్దనస్వామి, భక్తులు పాల్గొన్నారు.

శిలోమాతమ్మకు బోనాలు



శిలోమాతమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

గుర్రంకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటలో వెలసిన శిలోమాతమ్మకు శుక్రవారం మహిళలు బోనాలు సమర్పించారు. గుర్రంకొండ పోలేరమ్మ జాతరలో భాగంగా మొదటి రోజు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో దీలు బోనాలను తీసుకొచ్చి భక్తితో సమర్పించారు. పోలేరమ్మకు కూడా దీలు, బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవారికి పూజలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు దాతలు మజ్జిగ, పానకం అందజేశారు.

రెడ్డెమ్మ ఆలయానికి కిరీటం, శఠారి విరాళం



ఈవో మంజులకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మి రెడ్డెమ్మతల్లికి మండలంలోని చెర్లోపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ నాయుడు కుటుంబ సభ్యులు ఒక కేజీ బరువు గల వెండి శఠారి, సహస్ర ధారా పాత్రను శుక్రవారం అందజేశారు. మదనపల్లెకు చెందిన శారద, రెడ్డెప్ప నాయుడు దంపతులు 645 గ్రాముల బరువు గల వెండి కిరీటం ఈవో మంజులకు అందజేశారు.

మద్యం దుకాణాల వద్ద ఘర్షణ

గుర్రంకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్యం దుకాణాల వద్ద గురువారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గుర్రంకొండ పట్టణానికి చెందిన కొందరు యువకులు మద్యం దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన బెల్టుషాపులో మద్యం సేవించారు. బలిజగడ్డకు చెందిన ఓ యువకుడు, పెద్దపాళెం వీధికి చెందిన ఓ వ్యక్తి పరస్పరం మద్యం బాటిళ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఇద్దరూ గాయపడ్డారు. ఈ విషయంపై పోలీసులకు ఎటువంటి సమాచారం లేదు.

జూదరుల అరెస్టు

కలికిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): జూదం ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసి బైక్‌లు, సెల్‌ఫోన్లతోపాటు భారీగా నగదు స్వాధీనం చేసుకున్నట్టు శారు. ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మునిరత్నం తెలిపారు. కొర్లకుంట గ్రామం బెస్తపల్లె సమీపంలో పేకాట కేంద్రం నిర్వహిస్తు న్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం రాయచోటి ఎస్టీఎఫ్ బృందంతో పాటు, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మునిరత్నం దాడి చేసి రూ.1,50,850లు నగదు, 9 ద్విచక్ర వాహనాలు, 15 మొబైల్ ఫోన్లు దొరికాయి. 16 మందిని అదుపులోకి తీసుకుని కలికిరి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. సీఐ రెడిశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు హెచ్‌సీ మదనమోహన్‌రెడ్డి కేసు నమోదు చేశారు. పట్టుబడ్డవారిలో పత్తేగడ పంచాయతీ బాలయ్యకుంట, మూరేవాండ్లపల్లె, చిన్నమాలపల్లె, పీలేరుకు చెందిన వారున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌ఎస్ ట్యాంకు మొరవ పనులకు చర్యలు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్ఈ చంద్రశేఖర్

మదనపల్లె, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దే శించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు మొరవల ని ర్మాణానికి చర్యలు తీసుకుంటామని జల వన రులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన చిప్పిలి, గుట్టకిందపల్లె ఎస్‌ఎస్ ట్యాంకుల ని ర్మాణం పూర్తికాగా, పది శాతం ఉండే మొరవ పనులు నిలిపేయడంపై స్థానిక ఎమ్మెల్యే ఎం. షాజహాన్‌బాషా అభ్యంతరం వ్యక్తం చేశారు. వీటిని పూర్తి చేయాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన మంత్రి మాట్లాడుతూ హంద్రీ- నీవా పుంగనూరు బ్రాంచీ కెనాల్‌లో విలీనం చేయడం ద్వారా పూర్తి చేసేలా చర్యలు తీ సుకుంటామని హామీ ఇచ్చారు. జిల్లాలోకి వస్తున్న మంత్రికి ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లె శివారులో హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, మైనార్టీ నేత ఎస్.ఎ.మస్తాన్, పార్టీనాయకులు బంగారు రామకృష్ణ జి.నవీన్‌కుమార్‌చౌదరి, మాజీ కౌన్సిలర్ ఆర్.బాబునాయుడు తదితరులు స్వాగతం పలికారు.

విద్యుత్ కోతలు నివారించండి

మదనపల్లె టౌన్ : పట్టణంలోని గృహ వినియోగదారులకు కోతల్లేకుండా విద్యుత్ సర ఫరా చేయాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్పీడీసీఎల్ కార్యాలయ ఆవరణలోని సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం కూడా పెరిగిందన్నారు. దీంతో నియోజకవర్గం లో ఆరు నూతన సబ్‌స్టేషన్లు ఏర్పాటు చే యాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ 2 సబ్‌స్టేషన్లను మం జూరు చేశారని, మిగిలిన నాలుగు సబ్‌స్టేషన్లను కూడా త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. ఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గృహ, వ్యవసాయ, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీడీసీఎల్ అధికారులకు సూచించారు. ఎస్పీడీసీఎల్ ఈఈ గంగాధరం, ఎంఆర్‌టీ ఈఈ విజయభాస్కర్,టౌన్ ఏడీ హరిబాబు, ఏఈ అజయ్‌బాబు పాల్గొన్నారు.

జాతరకు ఆహ్వానం

మదనపల్లె అర్బన్ : స్థానిక బెంగళూరు రో డ్డులోని కోర్టు ఆవరణంలో జూన్ 3,4 తేదీల్లో నిర్వహించే కోర్టులో గంగమ్మ జాతరకు ఎమ్మె ల్యే షాజహాన్‌బాషాను ఆలయకమిటీ సభ్యులు ఆహ్వానించారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇంటి వద్దకు వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యదర్శి మార్పూరి ప్రభాకర్ నాయుడు, పెరవలి వేణుగోపాల్ నాయుడు, రాటకొండ రంగస్వామినాయుడు, మార్పూరి మహేష్, మల్లికార్జున నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలతో సారా నియంత్రణ

● స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధు



ఎక్సైజ్ సిబ్బందితో మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ మధు

పీలేరు, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలతో సారా నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధు తెలిపారు. పీలేరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటు సారా నియంత్రణ కోసం అమలు చేస్తున్న నవోదయం 2.0ను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా సారా తయారీ చేస్తున్న వారి అభిరుచికి అనుగుణంగా ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడం, వారికి శిక్షణ, సబ్సిడీ రుణాలు ఇప్పించడం, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోనే పనులు కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను ఎంపిక చేసుకుని సారా తయారీదారులను చైతన్యవంతుల్ని చేస్తూనే సారా తయారీ స్థావరాలపై దాడులు చేసి వారిని కట్టడి చేస్తున్నామన్నారు. అనంతరం ఆయన పీలేరు పోలీసు స్టేషన్ పరిధిలో నవోదయం కార్యక్రమ అమలు తీరుతెన్నులు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలి

● ప్రతి కూలీకి వంద రోజులు పని
● ఉపాధి హామీ పీడీ వెంకటరత్నం



ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న పీడీ వెంకటరత్నం

పీలేరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుపై రైతులు మక్కువ చూపాలని డ్వామా పీడీ వెంకటరత్నం సూచించారు. శుక్రవారం కేవీపల్లె మండలం సొరకాయలపేట వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు కోసం ఇప్పటికే పలువురు రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలో ఉపాధి పనులు జరుగుతున్నాయన్నారు. ఏ ఒక్కరూ పని లేదని ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పనులు అడిగిన వారందరికీ స్థానికంగానే ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ప్రతి కూలీకి విధిగా 100 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. సొరకాయల పేట వద్ద కాలువ పూడిక తీత పనులను పర్యవేక్షించారు. మస్టర్ పరిశీలించి కూలీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులలో నాణ్యత ఉండాలని కూలీలకు సూచించారు. ఎక్కువ మంది కూలీలు ఉపాధి పనులు చేయాలని పిలుపునిచ్చారు. పనులు లేవని బాధపడాల్సిన అవసరం లేదన్నారు. పీడీ వెంట కేవీపల్లె ఎంపీడీవో సుధాకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పోక్సో చట్టాలపై అవగాహన అవసరం

● సీడీపీవో భాగ్యమ్మ



బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం మే 16 (ఆంధ్రజ్యోతి) : యుక్త వయసు కలిగిన బాలికలు పోక్సో చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో భాగ్యమ్మ తెలిపారు. శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలంలోని మద్దయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుక్త వయసు కలిగిన బాలికలకు మహిళా హక్కులు, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. బాలల సంరక్షణ, , బాలలపై దుష్ప్రభావాలు, అఘాయిత్యాల నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు నేరమని, బాలికలు చదువుపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భవాని, మహిళా పోలీస్ గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, ప్రమీల, రాణి, శ్రావణి, బాలికలు, హెల్పర్లు పాల్గొన్నారు.

పీలేరు రూరల్: సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పిలుపునిచ్చారు. శుక్రవారం పీలేరు పట్టణం అజంతా మిట్టన ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కిశోర బాలికలు, వారి తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కే. చిన్నమ్మ, .జీ. లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: గుట్టపాలెం పంచాయతీ జంగంపల్లెలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. కౌమార దశలో పీడించే రక్త హీనత గురించి, దానిని అధిగమించడానికి తీసుకోవలసిన ఆహారాలు, జాగ్రత్తలు వివరించారు. బాల్య వివాహాల కారణంగా తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, మహిళా సంరక్షణ కార్యదర్శి నిర్మల, ఏఎన్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, నూర్జహాన్, శ్రీమతి, లావణ్య, బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

దోమలే ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పీలేరు, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలేనని, వాటి నియంత్రణ ద్వారా రోగాల బారిన పడకుండా ఉండవచ్చునని పీలేరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. జాతీయ డెంగీ దినం సందర్భంగా శుక్రవారం పీలేరులో రేగళ్లు, తలపుల పీహెచ్‌సీ సిబ్బంది డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. అనంతరం స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి రమేశ్ రెడ్డి, మలేరియా సబ్-యూనిట్ అధికారి విద్యాసాగర్, సీహెచ్‌వో జయలక్ష్మి, హెచ్‌ఈ కొండయ్య, ఎంపీహెచ్‌ఈవోలు శ్రీనివాసులు, చంద్రయ్య, సూపర్‌వైజర్లు చిన్నప్ప, కుసుమ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి : డెంగీ వ్యాధి ప్రాణాంతకం అని ఇది దోమకాటుతో వ్యాపిస్తుందని చెందుతుందని డాక్టర్ ప్రత్యూష తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ డెంగీ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని నీటి గుంతలు, పూడ్చివేసి, నీటి సంపులపై మూతలు పెట్టాలన్నారు. ఈ దోమలను లార్వా దశలోనే గుర్తించి చంపాలన్నారు. జ్వరం వచ్చినపుడు రక్త పరీక్షలు చేయించుకొని తగిన చికిత్స చేయించుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వాల్మీకిపురం : చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీలో పాల్గొని పరిసరాల పరిశుభ్రత, తాగునీటి నిల్వలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు కూడా డెంగీ విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జులేఖా బేగం, సాయిశ్రీ సూపర్‌వైజర్ సుధాకర్, వైద్య సిబ్బంది బానుబీ, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కలకడ: పరిసరాల శుభ్రతతో దోమల నివారణ సాధ్యమని డాక్టర్ మోహన్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలకడలో ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూన్ నెల నుంచి జనవరి వరకు దోమల లార్వా ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రజలు మురుగు నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఈ రాజమ్మ, రామకృష్ణమ్మ, భాగ్యలక్ష్మీ, హాజిరాబీ, ఉత్పల పాల్గొన్నారు.

దంపతులపై కోడి కత్తులతో దాడి



గాయపడిన శ్యామల, యర్రప్ప

నిమ్మనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): తల్లిని సరిగా చూసుకోవడం లేదని ఓ వ్యక్తి తన సొంత అన్న వదినలపై కోడి కత్తులతో దాడి చేసి గాయపరచిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చౌడేపల్లి మండంలం బోయకొండ పంచాయతీ యానాదికాలనీకి చెందిన యర్రప్ప(30), భార్య శ్యామల(26) నిమ్మనపల్లి మండలం బండ్లపై పంచాయతీ దుర్గవారిపల్లిలో టమాటా కట్లు నాటేందుకు వెళ్లారు. సాయంత్రం పని ముగించుకుని యానాదికాలనీకి వెళుతుండగా యర్రప్ప తమ్ముడు హనుమంతు అతని స్నేహితుడు అశోక్ కోడి కత్తులతో దాడి చేసి అక్కడినుంచి పరారయ్యారు. రక్తపు మడుగులో భార్య భర్తలను గమనించిన గ్రామస్తులు 108కు సమా చారం అందించగా, వారు మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య భర్తల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. తల్లి లక్ష్మమ్మను సరిగా చూసుకోలేదన్న కోపంతో తమ్ముడు హనుమంతు ఈ దాడి చేసినట్లు తెలుస్తోంది..

జిల్లా సరిహద్దులో మంత్రికి ఘన స్వాగతం



జయచంద్రారెడ్డి, ఇతర నాయకులతో మంత్రి నిమ్మల రామానాయుడు

ములకలచెరువు, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. అనంతపురం జిల్లాలో పర్యటించిన మంత్రి తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద హంద్రీ - నీవా కాంక్రీట్ పనుల పరిశీలనకు వెళ్తుండగా ములకలచెరువు సమీపంలోని జిల్లా సరిహద్దులో ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు మంత్రిని కలిశారు. అనంతరం మంత్రి రామానాయుడు ములకలచెరువులోని జయచంద్రారెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి కురబలకోట మండలం దొమ్మన్నబావి దగ్గరకు వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నేతలు తులసీధర్‌నాయుడు, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, చాంద్ బాషా, మస్తాన్, మొటుకు శివ, పాల రాము, ఎర్రంరెడ్డి తదతరులతో పాటు భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోలే కీలకం’



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుకు అందుబాటులో పోలింగ్ స్టేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకుని, ఓటరు కొత్త ఓటరు నమోదు ప్రక్రియలో సహకరించాలన్నారు. ఏఆర్‌వోలు కూడా వారి మండలాల పరిధిలో ప్రతి నెలా బీఎల్‌వోలతో సమీక్షించి తగు సూచనలివ్వాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం తహసీల్దార్లు ధనంజయులు, అమరనాథ్, నిర్మల, డీఏవో రాఘవేంద్ర, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి



ప్రకృతి వ్యవసాయపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివశంకర్

మదనపల్లె టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ శివశంకర్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్సీ భవనంలో వ్యవసాయ సిబ్బంది, డీఆర్‌డీఏ సిబ్బంది, మహిళా సంఘాలు, సంఘమిత్రలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగు చేసే పంటలు, దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మహిళా సంఘాల సహకారం ప్రకృతి వ్యవసాయాన్ని పెంచాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు రాజశేఖర్‌నాయుడు, మల్లికార్జునలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఏవో నాగప్రసాద్, ఏపీవో సుబ్రమణ్యం, ఏపీఎం చెన్నకేశవులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రవీణ్, ఖాదర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

‘కండక్టర్‌పై దాడి చేసిన మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి’



ధర్నా చేస్తున్న గ్రామస్థులకు సర్దిచెబుతున్న పోలీసులు

మదనపల్లె టౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు కండక్టర్‌పై దాడి చేసిన మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాను అరెస్టు చేయాలని చీకిలబైలు పంచాయతీ దొనబైలు గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్దకు చేరుకున్న దొనబైలు గ్రామసులు అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధుసూదన ట్రావెల్స్ బస్సు కండక్టర్ హరినాథ్‌పై మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఆయన అనుచరులు దాడి చేసి గాయపరచడం వారి దౌర్జన్యాలకు నిదర్శనమన్నారు. ఆయనపై హరినాథ్ టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు మాజీ ఎమ్మెల్యేకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారని, ఇలా చేస్తే తమకు న్యాయం ఎలా జరుగుతుందన్నారు. వెంటనే మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వన్‌టౌన్ ఎస్ఐ అన్సర్ బాషా, టు టౌన్ ఎస్ఐ రహీముల్లా సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆందోళనకారులకు సర్దిచెప్పారు. దీంతో ఆందోళనకారులు డీఎస్పీ మహేంద్ర వద్దకు వెళ్లి వినతి పత్రం అందజేశారు.

వేపులబైలు సచివాలయం తనిఖీ

పీలేరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులబైలు సచివాలయాన్ని పీలేరు ఎంపీడీవో శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సచివాలయాన్ని సందర్శించి కార్యాలయ సిబ్బంది రిజిస్టర్‌ను పరిశీలించారు. పంచాయతీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విధిగా సేకరించాలని సూచించారు. పంచాయతీలో తాగునీరు, సీసీ రోడ్లు, వీధి దీపాలు, శానిటేషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి సాంబశివ అయ్యప్ప, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరం సరస్వతి పుష్కరాల్లో అన్నదానం

మదనపల్లె అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో 12 రోజులపాటు నిర్వహించే సరస్వతి పుష్కరాల్లో ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణమూర్తి, శ్రీ వేంకటేశ్వర నిత్య అన్నదాన ట్రస్టు, ద్వారకా తిరుమల ఏపీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మునిగోపాలకృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నారాయణమూర్తి, మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి దంపతులను శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం, లక్ష్మీనారాయణశాస్త్రి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మన మిత్ర యాప్ సేవలలు వినియోగించుకోవాలి

రామసముద్రం, మే 16(ఆంధ్రజ్యోతి): మన మిత్ర యాప్ ద్వారా ప్రజలందరికీ 161 పౌర సేవలు వాట్సప్ ద్వారా అందుబాటులో ఉన్నాయని ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు శుక్రవారం మనమిత్ర యాప్‌కు సంబంధించిన రోల్ ఆఫ్ స్టాండ్స్‌ను ఎంపీడీవో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమిత్ర యాప్‌పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అన్ని గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలకు మనమిత్రకి సంబంధించిన రోల్ ఆఫ్ స్టాండ్స్ అందజేశామన్నారు. మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి వీటిని అన్ని గ్రామ సచివాలయాలలో డిస్ప్లే చేయాలని సూచించారు. యాప్‌లో ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా డైరెక్ట్‌గా కావాల్సిన సర్వీసులు వాట్సప్ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్, పంచాయతీ సెక్రటరీలు మునిస్వామినాయక్, రెడ్డిశేఖర్, రెడ్డిరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ‘తెలుగు రైతు’ నేత జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఐటీడీపీ అధ్యక్షుడు దొరస్వామి

కలకడ, మే 16(ఆంధ్రజ్యోతి): తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలకడలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథ్, చంద్ర మోహన్, త్యాగరాజు, తారకేశ్వర, నాగార్జున్‌నాయుడు, సుధీర్‌నాయుడు, కోట శ్రీనివాసుల నాయుడు, జీవన్, పల్లపు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఐటీడీపీ అధ్యక్షుడు దొరస్వామి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్ నాయుడుని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

కలికిరి ఆసుపత్రిలో అత్యవసర శస్త్ర చికిత్స

కలికిరి, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం అత్యవసర శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఓ బులేశు అనే వ్యక్తి తీవ్రమైన కడుపు నొప్పితో ఆసుపత్రికి వచ్చాడు. వైద్యాధి కారి డాక్టర్ పవన్‌కుమార్ వెంటనే అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయించి అపెండిసైటిస్‌గా తేల్చారు. డాక్టర్లు ఉదయకిరణ్, వెంకటేశ్ వెంటనే శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. మరో వైద్యుడు డాక్టర్ శశికుమార్ రాజు, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్, ఓటీ స్టాఫ్ నర్స్ ఉమామహేశ్వరి, టెక్నీషియన్ కృష్ణచైతన్య సాయంతో 7 గంటలకల్లా ఆపరేషన్ పూర్తి చేశారు. ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేయకుండా, అత్యవ సర శస్త్ర చికిత్స చేసిన వైద్యులను వైద్యాధికారి పవన్‌కుమార్ అభినందించారు. శస్త్ర చికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ ఉదయ్ కిరణ్‌ను పలువురు అభినందించారు. ఈ ఆసుపత్రిలో ఇలాంటి అత్యవసర శస్త్ర చికిత్స చేయడం ఇదే మొదటిసారిగా చెబుతున్నారు.